

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



అదో కాళరాత్రి

నవంబరు 6 అంటే కోనసీమ వాసులకు హడల్.. 28 ఏళ్ల క్రితం హరికేన్ సృష్టించిన పెను విధ్వంసం

నవంబరు 6. ఈ తేదీ వస్తోందంటేనే కోనసీమ ప్రజల గుండెల్లో దడ మొదలవుతుంది. అదో కాళరాత్రి. సరిగ్గా 28 ఏళ్ల క్రితం... అంటే 1996 నవంబరు 6న సంభవించిన హరికేన్‌తో కోనసీమ కకావికలమైంది. అప్పటి నుంచీ నవంబరులో భారీ వర్షం కురిసినా, మీడియాలో తుపాను హెచ్చరికలు విన్నా కోనసీమ వాసుల వెన్నులో వణుకు పుట్టుకొస్తుంది. ఎందుకంటే ఆనాటి భయంకరమైన ప్రకృతి విపత్తులో కోనసీమ ప్రజలు ఘోరమైన మూల్యాన్ని చెల్లించుకున్నారు. సోషల్ మీడియా లేని రోజులు కావడంతో బాహ్య ప్రపంచానికి హరికేన్ తుఫాను ప్రభావం అంతగా తెలియలేదు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు హుటాహుటిన కోనసీమ చేరుకున్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా సెక్రటేరియట్ ఏర్పాటుచేసి పాలన సాగించారు. నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ఆయన అప్పట్లో చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటూనే వున్నారు.

కథనం... 4లో



వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జేసీ నిషాంతి

యథావిధిగా రీ సర్వే

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ పరిపాలన ముఖ్య కమిషనర్, ల్యాండ్ రికార్డు సంచాలకుల ఆదేశాల మేరకు భూముల రీ సర్వే యథావిధిగా కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. ముఖ్య కమిషనర్ జి.సాయిలక్ష్మి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకుడు కేఎస్‌బీ లత్కర్ అమరావతి నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి జేసీ పాల్గొన్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ భూ సర్వేకు సంబంధించి సరిహద్దు రాళ్లపై ఉన్న గత ప్రభుత్వ నాయకులపేర్లు పూర్తిగా తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని ఆ శాఖల అధికారులను ఆదేశించారు. సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, ఆర్డీవోలు కె.మాధవి, డి.అఖిల, పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో జరిగిన కూటమి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. వేదికపై ఎమ్మెల్యేలు ఆనందరావు, సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

కూటమి నేతల మధ్య విభేదాలకు
చెక్ పెడదాం

అమలాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబంలో ఎన్నో సమస్యలు ఉంటాయి. అటువంటిది మూడు రాజకీయ పార్టీలతో ఏర్పడ్డ సమస్యలకు చెక్ పెట్టే పరిస్థితి వచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 'కూటమి పార్టీల్లో సమస్యలు లేవని చెబితే అది తప్పే. ఒకరికొకరు పరస్పరం చర్చించుకుని వాటిని పరిష్కరించుకోవడం ద్వారా విబేధాలకు చెక్ పెట్టి సమర్థవంతమైన పాలన దిశగా పయనించవచ్చు. ఇటువంటి కీలక పరిస్థితుల్లో అందరం కలిసి జాగ్రత్తగా పనిచేయాలి' అని కేడర్‌కు విజ్ఞప్తి చేశారు. కోనసీమ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారి అమలాపురం వచ్చిన అచ్చెన్నాయుడుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి మంత్రి అంటే జిల్లా సమీక్షా మండలి సమావేశం పెట్టుకుని వెళ్లిపోవడం కాదు, పొలిటికల్ గవర్నెర్స్‌లోభాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యకర్తలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటి పరిష్కారంలో అధికారులను భాగస్వాములు చేయడమే అన్నారు. 'రాష్ట్రంలో 22 ఎంపీ స్థానాలు ఇచ్చారు. ఇచ్చాపురం నుంచి నెల్లూరు వరకు రెండు స్థానాలు మినహా కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారు. తద్వారా కేంద్రంలో ఏపీ పరపతి పెరిగింది. ప్రధాని మోదీ చేస్తున్న సహాయం వల్ల నిలదొక్కుకున్నాం. వెంటిలేటర్ స్థాయి నుంచి ఆక్సిజన్ పీల్చే స్థాయికి చేరుకున్నామంటే కేంద్రం చలవే. సూపర్-6 పథకాలను అమలు చేస్తూ వస్తున్నాం. గత ముఖ్యమంత్రి జగన్ రూ.14లక్షల కోట్లు అప్పు చేశాడు. డబ్బులు లేవు. హామీలు ఎలా అమలు చేస్తారని ప్రజలు అనుకున్నారు. అయినా సరే రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేశాం. సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నా'యన్నారు. 'ప్రజలు అచంచల విశ్వాసంతో చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి తిరుగులేని మెజార్టీ ఇచ్చారు. నూటికి 93శాతం ఎమ్మెల్యేలను గెలిపించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో అధికారం అప్పగించి ఈ నెల 12వ తేదీకి ఐదు నెలలు పూర్తి అవుతుంది. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నమయ్యాయి. ఆర్థికంగా కోలుకోలేని రీతిలో వ్యవస్థలను దెబ్బతీశారు' అని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'వెంటిలేటర్‌పై ఉండే ఆర్థిక వ్యవస్థను చంద్రబాబు తప్ప మరెవ్వరూ సరిదిద్దలేరు. అందుకే ప్రజలు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో 164 స్థానాలు రావడానికి పునాది వేసింది చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లే. చంద్రబాబును అడ్డగోలుగా అరెస్టు చేసినప్పుడు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినప్పుడు పెద్దమనిషిగా, ఈ రాష్ట్రం బాగుకోరే వ్యక్తిగా, రేపు మళ్లీ ఏదైనా తప్పు జరిగి జగనే ముఖ్యమంత్రి అయితే దణ్ణం పెట్టి రాష్ట్రం వదిలి వెళ్లిపోవడం తప్ప బతకలేమని భావించి ఓ మంచి నిర్ణయం తీసుకుని సపోర్టు చేసిన మహోన్నత వ్యక్తి పవన్‌కల్యాణ్ అని అచ్చెన్నాయుడు కితాబు ఇచ్చారు. ఒక దుర్మార్గుడు గత ఐదేళ్లలో ఈ రాష్ట్రాన్ని పాలించాడు.

కోనసీమకు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా నియమిస్తామనిచెప్పినప్పుడు చాలా సంతోషించాను. అభివృద్ధి జరగనటువంటి ప్రాంతంలో, అందునా కొత్తగా ఏర్పడ్డ కోనసీమ జిల్లాలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ఇన్‌చార్జి మంత్రి హోదాలో పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో తనకు ప్రత్యక్ష సంబంధాలున్నాయని చెప్పారు.

అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ పార్టీల మధ్య కొద్దిపాటి విబేధాలు ఉన్నాయని, నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసి ఎటువంటి విబేధాలు లేకుండా చూడాలని సూచించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం అభివృద్ధి చెందినట్టుగా అమలాపురం అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జనసేనకు చెందిన రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణమాట్లాడుతూ రాజోలు దీవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డ్రెయిన్లు అస్తవ్యస్తంగా మారిపోయాయని వివరించారు. సాగునీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రధాన పంటలు సైతం దెబ్బతింటున్నాయన్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను గిడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ మత్స్యకారులకు చమురు సంస్థలు అందించే నష్ట పరిహారాన్ని గత వైసీపీ ప్రభుత్వం తామే ఇస్తున్నట్టు గొప్పలు చెప్పుకుందన్నారు. మత్స్యకార దినోత్సవం రోజున ముమ్మిడివరంలో బహిరంగ సభ నిర్వహించి మత్స్యకారులకు రూ.149 కోట్లు పరిహారాన్ని చెల్లించి సభకు హాజరు కావాలని అచ్చెన్నాయుడును కోరారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని, ప్రజలు ఎంతో ఆనందంగా జీవిస్తున్నారన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఓటర్లకు నేతలు విజ్ఞప్తి చేశారు.

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మోకా వెంకటసుబ్బారావు, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కంచిపల్లి అబ్బులు, కొప్పుల నాగమానస, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, కూటమి నేతలు మట్టా మహలక్ష్మిప్రభాకర్, పెచ్చెట్టి చంద్రమౌళి, అల్లాడ స్వామినాయుడు, వీవీఎస్ చౌదరి, మోకా ఆనంద్‌సాగర్, బండారు శ్రీనివాస్, వేగుళ్ల లీలాకృష్ణ, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కాగా జనసేన నాయకుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు టీడీపీ నేతల ముందు నిరసన గళం వినిపించారు. జనసేన నాయకులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, రానున్న రోజుల్లో ఇలాగే ఉంటే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించడం కలకలం రేపింది. ఎమ్మెల్సీ పట్టభద్రులు ఓటర్లను చేర్పించే విషయంలో కూటమి నేతలు చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు.

గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

రూ.14లక్షల కోట్లు అప్పులు చేసిందీ జగనే

వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రమణబాబు, కూటమి నాయకులు

చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకోవాలి: మంత్రి సుభాష్

మరో అతిథి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులో కూడా ఏదో నేర్చుకోవాలనే తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. విర్రవీగినతనంతో జగన్ ఏమైపోయాడో చూడండన్నారు. వార్డు మెంబరు కూడా కాని నన్ను ఎమ్మెల్యేని చేసి మంత్రిని చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందని... ఆయన తిట్టినా, కొట్టినా కష్టపడి పనిచేస్తానన్నారు. సాక్షి పత్రికపై ఆరోపణాస్త్రాలు సంధించారు.



తాగునీటి వసతుల కల్పనపై
కలెక్టర్ సమీక్ష

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్, కార్పొరేట్ సామాజిక బాధ్యత, ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన నీటి సరఫరా అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు సురక్షిత మంచినీటిని సమృద్ధిగా సరఫరా చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలో తాగునీటి వసతుల కల్పన, సీపీడబ్ల్యు, పీడబ్ల్యు స్కీముల ఆపరేషన్, నిర్వహణ అంశాల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ఇంజనీర్లతో ఆయన సమీక్షించారు. వివిధ గ్రాంట్ల కింద మంజూరైన అభివృద్ధి పనులకు గురించి, టెండర్ ప్రక్రియ తదితర అంశాలపై స్పష్టమైన నివేదికలను నియోజకవర్గ, మండల స్థాయిల్లో రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ మూడు దశల్లో చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీశారు. మొదటి దశలో కుళాయి కనెక్షన్లు లేని ఆవాసాలకు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు వేశామని, రెండో దశలో రెట్రో ఫిటింగ్ వర్కులు పురోగతిలో ఉన్నాయని, మూడో దశలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. జలజీవన్ మిషన్ కింద మూడు దశల్లో వివిధ కేటగిరీల్లో 1,821 పనులు చేపట్టామన్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ, నిఘా వ్యవస్థలు అంకితభావంతో పనిచేస్తూ నీటి కాలుష్యానికి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కుళాయి కనెక్షన్లు, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతంచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు పద్మనాభం, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి పదవితో గౌరవించారు... మందలించే హక్కు చంద్రబాబుకు ఉంది పనితీరు మెరుగు పరుచుకుంటా...

కార్మిక శాఖ మంత్రి సుభాష్

... మెయిన్‌లో



ఆత్రేయపురంలో వెండిపుట్టలో దర్శనమిచ్చిన సంతాన సుబ్రహ్మణ్యస్వామి

భక్తిశ్రద్ధలతో
నాగుల చవితి

జిల్లాలో నాగుల చవితిని వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు పంట పొలాల వద్ద పుట్టలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువజామున మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పాలు, వడపప్పు, చిమ్మిలి, తేగలు, కోడిగుడ్లను పుట్టలో వేసి నాగేంద్రుడికి నైవేద్యం సమర్పించారు. చిన్నారులు బాణసంచా కాల్చారు. .... 6లో



ముమ్మిడివరంలో పుట్టలో పాలు పోసి నాగేంద్రుడికి నమస్కరిస్తున్న భక్తులు

సీఎంవో ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం ద్వారా స్వీకరించిన అర్జీలను స్పష్టతతో పరిష్కరించినప్పుడే అర్జీదారులు సంతృప్తి చెందుతారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ కోసం కార్యక్రమం ద్వారా అందిన అర్జీల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రధానంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని వివిధ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రజా సమస్యల పరిష్కార విధానంపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించి పరిష్కార సరళిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కార సరళి, పురోగతి అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. గడువు తీరిన అర్జీలు ఏ స్థాయిలోనూ పెండింగు ఉండరాదన్నారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటివరకు పరిష్కరించిన అర్జీలు, ఇంకా పరిష్కరించాల్సిన అర్జీల సమస్యలపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్‌మోహనరావు, ఆర్డీవోలు డి.అఖిల, పి.శ్రీకర్, కె.మాధవి, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, జీఎస్‌డబ్ల్యుఎస్ కో-ఆర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిసోర్స్‌పర్సన్ పోస్టుకు
దరఖాస్తుల స్వీకారం

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి, పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ నియామకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా కార్యనిర్వాహక సంచాలకుడు బీవీ రమణ తెలిపారు. ఇన్సెంటివ్ పద్ధతిలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్‌లో డిగ్రీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ పూర్తి చేసి కంప్యూటర్ పరిజ్ఞానం, బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఆసక్తి ఉన్నవారు డీఆర్పీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను పోస్టుద్వారా గానీ, మెయిల్‌కు గానీ పంపించవచ్చు. మరిన్ని వివరాలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏపీఎఫ్‌పీఎస్, జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం, నల్లవంతెన వద్ద సంప్రదించవచ్చు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని రమణ చెప్పారు.



స్విచ్ ఆన్‌చేసి పనులను ప్రారంభిస్తున్న ఈఈ విశ్వేశ్వరరావు

స్కవర్ స్లూయిస్ ఆపరేషన్

ఆత్రేయపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్టు జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాశీవిశ్వేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద హెడ్‌వర్క్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ డెల్టా స్కవర్ స్లూయిస్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. గేట్లను 5 మీటర్లు పైకి ఎత్తి 4,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. . డీఈఈ ఆనందబాబు, సునీల్‌బాబు, ఏఈ అద్దంకి సాయిరామ్ పాల్గొన్నారు.

బాల సంరక్షణ కేంద్రాలకు
రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాల సంరక్షణ కేంద్రాలన్నీ లైసెన్సు తీసుకున్నప్పటికీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా పర్యవేక్షణాధికారి ఎల్.ఆదిసాయిలక్ష్మిమణి తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలు జువైనల్ జస్టిస్ చట్టం-2015, 2021లోని సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నిర్దేశించిన ఫార్మాట్‌లో దరఖాస్తులను నవంబరు 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ కార్యాలయం, విజయవాడకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమాలక్ష్మిని 7997833823 నెంబరులో సంప్రదించాలని కోరారు.



కలెక్టర్ ప్రశాంతి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

11నుంచి నామినేషన్ల స్వీకరణ

సహాయ రిటర్నింగ్ అధికారిగా డీఆర్వో శ్రీరామచంద్రమూర్తి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో 4 తేదీ నుంచే జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎన్నికల ప్రక్రియ ముగిసే డిసెంబర్ 12 వరకూ ఈ కోడ్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.శ్రీరామచంద్రమూర్తితో కలిసి ఆమె మాట్లాడారు. పూర్వపు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ జారీ చేసిందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) టి.శ్రీరామచంద్రమూర్తి వ్యవహరిస్తారని చెప్పారు. మొత్తం గోదావరి జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో భాగంగా జిల్లాలో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు అక్కడే ఓటుహక్కు వినియోగించుకోవాలని చెప్పారు. మండలానికి ఒకటి వంతున జిల్లాలోని 18మండలాల్లో 10 కేంద్రాలు, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 2893 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారన్నారు.

11నుంచి నామినేషన్ల స్వీకరణ

ఈ ఉప ఎన్నికకోసం ఈనెల 11న నోటిఫికేషన్ జారీ కానుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని, 18వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని, 19న నామినేషన్ల స్క్రూట్నీ చేసి 21న అభ్యర్థుల విత్‌డ్రాకు చివరి తేదీ అన్నారు. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుందని, 9న ఓట్లను లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు. 12వ తేదీకి మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు నేటితో ముగుస్తున్న గడువు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదుకు 1,34,298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఓటు నమోదు అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారంతో ఓటు నమోదు గడువు ముగుస్తోందన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా 1785, కాకినాడ జిల్లా 25,964, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 28,227, తూర్పుగోదావరి జిల్లా 24,825, పశ్చిమ గోదావరి జిల్లా 31,757, ఏలూరు జిల్లాలో 21,740 దరఖాస్తులు వచ్చాయన్నారు. అర్హులైన పట్టభద్రులు బుధవారం కూడా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అభ్యర్థులు ఓటు కోసం తహశీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

లేటరైట్ తవ్వేటప్పుడు క్యూబిక్ మీటర్లలో కొలుస్తారు. తవ్విన తర్వాత తరలింపు సమయంలో దాన్ని మెట్రిక్ టన్నులుగా పరిగణిస్తారు. ఇది రా మెటీరియల్‌గానే ఉండగా గ్రేడ్‌ను బట్టి ధర ఉంటుంది. లేటరైట్ ఒక మెట్రిక్ టన్ను ధర - రూ.950 నుంచి రూ.1100 ఉంటుంది.

వంతాడ సముద్ర మట్టానికి - 350 మీటర్ల ఎత్తులో ఉంది
ఇక్కడ లీజుకు తీసుకున్నది - 220 ఎకరాల అటవీ భూమి
ఇక్కడి గృహాల సంఖ్య- 110... జనాభా - 550మంది

2013 నుంచి 2033 వరకు వంతాడ రిజర్వ్‌ఫారెస్ట్‌లో లాటరైట్ తవ్వకాలకు ఆంధ్రా మైనింగ్ కంపెనీ లీజు పొందింది.

ఇప్పటివరకు తవ్వింది - మొత్తం 83.29లక్షల మెట్రిక్ టన్నులు
ఒడిశాకు తరలించినది - 32.75లక్షల మెట్రిక్ టన్నులు
చైనాకు తరలించినది - 4.65లక్షల మెట్రిక్ టన్నులు

ఈస్ట్ కేజీఎఫ్.. వంతాడ!



వంతాడలో లేటరైట్ తవ్వకం



వంతాడలో లేటరైట్ తరలింపునకు క్యూకట్టిన లారీలు

కేజీఎఫ్ గుర్తుందా.. అక్కడ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్.. బంగారం కోసం జరిగే అన్వేషణ.. రయ్యిమంటూ దూసుకెళ్లే టిప్పర్లు.. అదొక ప్రత్యేక ప్రపంచం.. అలాంటిదే ఇక్కడా మన ఈస్ట్‌లోను ఉందండి.. కానీ ఇక్కడ లేటరైట్ తవ్వుతుంటారు. సముద్ర మట్టానికి 350 మీటర్ల ఎత్తులో ఎక్కడో కొండపై ఉండే ఈ ప్రాంతానికి సాధారణ వాహనాల్లో వెళ్లలేం. సరైన రోడ్డు మార్గం కూడా లేదు. ఘాట్ రోడ్డు తరహాలో ఉండే ఒకే ఒక్క దారిలో నిత్యం లేటరైట్ లోడుతో లారీలు రయ్‌మంటూ దూసుకుపోతుంటాయి. ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా ఓ రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఆ ఉమ్మడి జిల్లా కేజీఎఫ్ ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుందా అయితే ఈ కథనం చదివేయండి మరి..

ప్రత్తిపాడు,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప..ఊరు దిబ్బ అంటే ఇదేనేమో.. ఒక పక్క ప్రతి రోజూ కోట్లలో టర్నోవర్.. మరో పక్క కనీసం రోడ్డు మార్గం కూడా గిరిజన తండా అది.. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడ గ్రామం ఉంది.. ఇక్కడ 110 గృహాలు ఉండగా 550 మంది జనాభా నివసిస్తున్నారు.ఎందుకంటే ఇది ఒక గిరి జన తండా..ఇందులో విశేషమేముందని తీసిపారేయవద్దు అసలు విషయం తెలిస్తే ఆశ్చర్యపోక మానరు.. ఒకప్పుడు పచ్చటి అందాలకు నెలవు. కానీ ఇప్పుడు లేటరైట్ మైనింగ్‌కి పెట్టింది పేరు.. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండడంతో ఏడాది పొడవునా మైనింగ్ తవ్వకాలు జరుగుతుంటాయి. కానీ ఆ ఊరు మాత్రం అభివృద్ధికి ఎంతో దూరంగా ఉంది. అత్యవసరమైతే మరో దారిలో కొండ దిగి వెళ్లాల్సి ఉంటుంది. ఓ పక్క రూ.కోట్లలో టర్నోవర్ జరిగే లేటరైట్ తవ్వకాలు.. మరో పక్క కనీస అభివృద్ధికి నోచుకోని ఊరు.. ఇంత వ్యత్యాసం ఉన్న ఈ ప్రాంతం పేరు వంతాడ.. అయినా పాలకులకు పట్టడం లేదు.

లేటరైట్ ఎగుమతికే ప్రత్యేక రైల్వేలైన్

వంతాడలో రెండు దశాబ్దాలుగా లేటరైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి ముడిసరుకును 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తొండంగి మండలం రావికంపాడుకు టిప్పర్లలో తరలిస్తారు. అక్కడ ఈ లేటరైట్ తరలింపునకు ప్రత్యేకంగా రైల్వేస్టేషన్ నిర్మించారు. దగ్గర్లోని మెయిన్ రైల్వే లైన్ నుంచి ఇక్కడకు ప్రత్యేక లైన్ కూడా వేశారు. వంతాడ నుంచి ఇక్కడకు తెచ్చిన లేటరైట్‌ను రావికంపాడు రైల్వేస్టేషన్ నుంచి ఒడిస్సాకు గూడ్స్ రైళ్లలో ఎగుమతి చేస్తారు. అక్కడ అల్యూమినియం ఫ్యాక్టరీల్లో దీన్ని ప్రాసెసింగ్ చేసి స్టీల్ తయారీకి వినియోగిస్తారు. తెలంగాణ



రావికంపాడులో రైల్వేస్టేషన్ వద్ద లేటరైట్ గుట్టలు

- లేటరైట్ గనులకు ప్రసిద్ధి వంతాడ
- ఏడాది పొడవునా లేట..రైట్
- రవాణాకు ప్రత్యేక రైల్వేస్టేషన్
- రావికంపాడు టూ ఒడిస్సా
- సీఆర్ఎస్ నిధుల ఊసేలేదు
- కానరాని మౌలిక వసతులు
- యువతకు ఉపాధి లేదు..
- అయినా పట్టని నాయకగణం

లేటరైట్ అంటే..

లేటరైట్ అంటే ఉష్ణమండల ప్రాంతాల్లో భూమిలో లభించే అరుదైన ఖనిజం.దీన్ని నిర్మాణ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ఇది అత్యంత విలువైన వనరు. దీని తవ్వకం వల్ల పర్యావరణపరంగా,స్థానికంగా ప్రతికూల ప్రభా వం చూపిస్తుంది. ఈ లేటరైట్ తవ్వగా వచ్చే ముడి సరుకు సిమెంట్, అల్యూమినియం ఫ్యా క్టరీల్లోసిమెంట్,స్టీల్ తయారీకి ఉపయోగిస్తున్నారు.

లేటరైట్ గనులకు ప్రసిద్ధి..

ఇ.గోకవరం పంచాయతీ పరిధిలో వంతాడతో పాటు గిరిజనాపురం, ఎరకంపాలెం, ఆరేళ్లధార, వే ములపాలెం హామ్లెట్లుగా ఉన్నాయి. వంతాడలో మాత్రమే లేటరైట్ గనులు పుష్కలంగా ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో 20 ఏళ్ల కిందటే గుర్తించారు.అప్పటి నుంచి ప్రభుత్వ అనుమతుల మేరకు పలు కంపెనీలు ఇక్కడ తవ్వకాలు చేప డుతున్నాయి.మొదట్లో మహేశ్వరి కంపెనీ లీజుకు తీసుకుని తవ్వకాలు చేపట్టింది. తర్వాత కొన్ని కం పెనీలు మారాయి. ప్రస్తుతం ఆంధ్రా మినరల్స్ అనే కంపెనీ లీజు నడుస్తోంది.ఈ కంపెనీ వం తాడ కొండ పరిధిలోని 220 ఎకరాల్లో మైనింగ్ తవ్వకాలకు లీజుకు తీసుకుంది.ప్రస్తుతం వంతాడ గనులపై లేటరైట్ గనుల తవ్వకాలు సాగుతున్నాయి. గతంలో 200 వరకు లారీలు కొండ పైనుంచి కిందకు వచ్చేవి. ఇప్పుడు 50 లారీల వరకు రవాణా చేస్తున్నట్టు సమాచారం.

కళ్లెదుటే బంగారం..గ్రామాభివృద్ధి శూన్యం



వంతాడ గిరిజన గ్రామం

చంద్రబాబు టు పవన్ సుపరిచితమే..

వంతాడ గ్రామాన్ని ఎందరో రాజకీయ ఉద్దండులు గతంలో సందర్శించారు. వంతాడ లేటరైట్ గనుల్లో అక్రమాలు, దోపిడీలకు వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజా సంఘాలు పోరాటాలు నిర్వహించాయి. వంతాడ గ్రామాన్ని అప్పట్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడిగా చిరంజీవి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, సీపీఐ, సీపీఎం నేతలు నారాయణ, మాజీ ఎంపీ మిడియం బాబురావు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ సందర్శించారు.గ్రామంలోని రావిచెట్టు రచ్చబండ వద్ద సమావేశాలు నిర్వహించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి హామీలు ఇచ్చారు. అయినప్పటికీ వంతాడ వాసుల గోడు అరణ్యరోదనగానే మిగిలింది. ఈ గిరిజనగూడెం సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగానే ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి వంతాడ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

తరగని నిధి ఉన్నా..సమస్యలే

ప్రత్తిపాడు, రాజవొమ్మంగి మండల గ్రామాల సరిహద్దులో ఉన్న వంతాడ రెండు దశాబ్దాలుగా లేటరైట్ మైనింగ్ గనుల తవ్వకాలకు కేంద్రంగా ఉంది. కోట్ల రూపాయలు సంపద చుట్టూ ఉన్నా ఆ గిరిజన గూడెం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. ఇక్కడ గనుల తవ్వకాల మాటున జరిగిన అన్యాయాలపై గిరిజనులతో పాటు ప్రజాసంఘాలు, ఎన్నో పార్టీలు పోరాడాయి. దీంతో ఈ గూడెం పేరు అప్పట్లో మార్మోగింది. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి నేతల సందర్శనతో వంతాడ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.అయినా కనీస వసతుల్లేక ప్రజలు అల్లాడుతున్నారు.కొండపై 110 నివాస గృహాలున్నాయి.వీటిలో 550 మంది నివసిస్తున్నారు.వీరిలో ప్రస్తుతం 90 మంది నివాస గృహాలకు దరఖాస్తు చేసినా మంజూరు కాక గృహాలు నిర్మించుకోలేకపోయారు. జలజీవన్ మిషన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకానికి మోటారు ఏర్పాటు చేయకపోవడం వల్ల గిరిజనులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్ కంపెనీ అవసరాల నిమిత్తం ఈ గ్రామంలో ఇనుప స్థంభాలను ఏర్పాటు చేసి కరెంటును సరఫరా చేశారు. ఈ స్థంభాలకు విద్యుత్ సరఫరా జరిగి పశువులు, గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి స్థానే సిమెంటు స్థంభాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో 1 నుంచి 6వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ 33 మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ బెంచీలు, ప్రహరీ, మరుగుదొడ్లు, కాంపౌండ్ హాలు వంటివి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అనారోగ్యం వస్తే కొండ దిగాల్సిందే..

- వంతాడ గ్రామం పెద్దిపాలెం పీహెచ్‌సీలో ఉంది.గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వాళ్లు కొండ దిగి ఆ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. పెద్దిపాలెం పీహెచ్‌సీ నుంచి నెలకోసారి వైద్యులు వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తుంటారు.
- **వంతాడ** గిరిజనులకు ఉపాధి అవకాశాల్లేవు.లేటరైట్ మైనింగ్‌లోనైనా ఉపాధి కల్పించాలన్న డిమాండ్ ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 30 నుంచి 40 మంది పనిచేసేవారు.గత వైసీపీలో వారిని పనులు నుంచి తొలగించారు.
- గ్రామంలో లేటరైట్ అవసరాల నిమిత్తం తవ్వేసిన కొండలు అలానే వదిలేశారు.దీంతో వర్షాలు పడినప్పుడు ఆ గోతుల్లో నీరు ఉండిపోయి ప్రమాదకరంగా మారుతోంది. నిబంధనల ప్రకారం తవ్వకాలు చేపట్టిన చోట ఏర్పడిన గోతులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పూడ్చాలి. కానీ, మైనింగ్ కంపెనీలు అలా చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.
- కొండపోడు భూముల రెవెన్యూ పట్టాలకు గిరిజనులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అది నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

వంతాడకు దారేది..



వంతాడ గ్రామానికి రౌతుపాలెం వైపు నుంచి ప్రత్తిపాడు వెళ్లడానికి ఒకదారి ఉంది. వంతాడ నుంచి కొండ దిగి రౌతుపాలెం రావాలి. అక్కడి నుంచి లంపకలోవ మీదుగా ప్రత్తిపాడుకు 10 కిలోమీటర్లు పడుతుం ది. కొండ తిమ్మాపురం వైపు నుంచి ఏలేశ్వరం వెళ్లడానికి మరొక దారి ఉంది. కానీ వర్షాల కార ణంగా దెబ్బతిని అది మూతపడిపోయి ఉంది. కొండ తిమ్మాపురం రహదారి కాలిబాట మార్గంగా మిగిలిపోయింది.ఈ రహదారులు ఘాట్ రోడ్డులా ఉండి ప్రమాదకర మలుపులు తిరిగి ఉంటాయి. బొలెరో లాంటి వాహనాలు తప్ప సాధారణ వాహ నాల్లో వెళ్లలేం. ఈ రెండు రహదారులను పక్కా బీటీ రహదారులుగా అభివృద్ధి చేయాలని గిరిజనుల కోరుతున్నారు.

మైనింగ్‌లో పని కల్పించాలి



వంతాడ లేటరైట్ మైనింగ్‌లో యువతకు పనిబాట్లు కల్పించాలి. గ్రామంలో అనారోగ్యాలకు గురైన వారిని ఏలేశ్వరం, ప్రత్తిపాడుకు తరలించడం కష్టసాధ్యంగా మారింది. రౌతుపాలెం, కొండ తిమ్మాపురం రహదారి మార్గాలు అభివృద్ధి చేయాలి.

-కుడే రాజబాబు, యువకుడు, వంతాడ

సీనరేజి రావడం లేదు..



ఐదేళ్లుగా మైనింగ్‌కు సంబంధించిన సీనరేజి రావడంలేదు. ఆదాయం ఆగిపోయింది. గతంలో సీనరేజీ బానే వచ్చేది. అంతకుముందు ఏడాదికి రూ.2లక్షల వరకు వచ్చేది. మాకున్న సమాచారం మేరకు ఈ నెల నుంచి రావొచ్చని ఆశిస్తున్నాం.

-వనపర్తి రామలక్ష్మి, సర్పంచ్, వంతాడ

తవ్వకాలతో విధ్వంసం

తూర్పు కనుమలను విధ్వంసం చేస్తూ వంతాడలో లేటరైట్ తవ్వకాలపై పర్యావరణవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొండల తవ్వకంవల్ల దుమ్ము, ధూళి రేగి పరిసరాల్లోని పచ్చదనం దెబ్బతింటోందని, లారీల్లో లేటరైట్ తరలింపుతో చుట్టపక్కల పంటలపై దుష్ప్రభావం చూపిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ చేసిన ప్రాంతాలను నిబంధనల ప్రకారం నీటితో తడపాల్సి ఉన్నా అదీ చేయడంలేదని వాపోతున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ కూడా స్థానికంగా ఖర్చుచేసిన దాఖలాలు లేవనివారు అభిప్రాయపడుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ

- కాకినాడ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ
- ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలు...16,316 మంది ఓటర్లు
- నామినేషన్ల దాఖలకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సిందే
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా 11న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను నియమించారు. కాకినాడ కలెక్టరేట్‌లోనే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆరు జిల్లాల నుంచి నామినేషన్ల దాఖలకు కాకినాడ కలెక్టరేట్‌కు రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఎన్నికల రిట్నరింగ్ అధికారులుగా కాకినాడ డీఆర్వో జె.వెంకటరావు, తూర్పు గోదావరి జిల్లా డీఆర్వో సీతారామ్మూర్తి, కోనసీమ జిల్లా డీఆర్వో వి.మదన్‌మోహన్, పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు డీఆర్వో వి.విశ్వేశ్వరరావులను నియమించారు. వీరు ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలు జిల్లాలవారీగా..

ఆరు జిల్లాల్లో 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కేంద్రాలు, తూర్పు గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 20 కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 22 కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 12 కేంద్రాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్లు జిల్లాల వారీగా..

మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,662 ఓటర్లు ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించి నియోజకవర్గాల పరిధిని ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించింది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాల్లోని ఉంగుటూరు, భీమ డోలు, నిడమర్రు, గణపవరం, పెదవేణి, పెదపా డు, దెందులూరు, ద్వారకా తిరుమల, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం, కామవరపుపేట, జంగారెడ్డిగూడెం మండలాలు, అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు, వరరామచంద్రపురం, ఎటపాక, కూనవరం మండలాలుగా నిర్ణయించింది.



అమెరికాలోని టెక్సాస్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న భార్యాభర్తలు సలాది కొండలరావు, సూరవరపు అనురాధ

ఎన్నికలు హోరాహోరీగా జరుగుతున్నాయి

పిఠాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్ష పదవికి ఈ సారి హోరాహోరీగా ఎన్నికలు .జరుగుతున్నాయి. కాకినాడ, పిఠాపురం పట్టణాలకు చెందిన మేము అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నాం. డోనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ఆయన గెలిస్తే మార్కెట్ బాగుంటుందని మా భావన. అయితే పోటీ తీవ్రంగానే ఉంది. ఎవ్వరికి గెలుపు అంత సులభం కాదు. భారతీయ సంతతికి చెందిన కమలాహారిస్‌కు కూడా ఓటర్లు మద్దతు అధికంగానే ఉంది. ఎవ్వరు గెలుస్తారన్నది ఉత్కంఠగానే ఉంది.





1996 సంవత్సరంలో తుఫాను చిత్రాలు(ఫైల్)

అదో కాళరాత్రి

నవంబరు 6 అంటేనే కోనసీమ వాసులకు హడల్..

28 ఏళ్ల క్రితం సృష్టించిన హరికేన్ పెను విధ్వంసం

(ఆంధ్రజ్యోతి-మండపేట)

పచ్చదనం, అసూయపరిచే అందం కోనసీమ సొంతం... అటువంటి సుందర సీమను పెను తుఫాను అతలాకుతలం చేసింది. 1996 నవంబరు 6 బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన చినుకులు ఈదురుగాలులై పెను తుఫానుగా మారి పచ్చని సీమను అస్తవ్యస్తం చేసింది. జన నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం, పశు నష్టం...ఇలా అనేక విధాలుగా కోనసీమ కాటిసీమగా మారింది. ఇది జరిగి నేటికి 28 సంవత్సరాలు కావస్తోంది. ఆనాటి కాళరాత్రిని ప్రజలు నేటికీ మరచిపోలేరు. లక్షల్లో నేలవాలిన కొబ్బరిచెట్లు తలలు వాల్చాయి. వేలల్లో జనం మృత్యువాతపడ్డారు. గృహాలు పేకమేడల్లా కూలిపోయాయి. మత్స్యకార తీర ప్రాంతాలు, గ్రామాలకు జరిగిన నష్టం అపారం. అప్పట్లో సీఎంగా వున్న చంద్రబాబు యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. హుటాహుటిన ప్రత్యేక హెలికాప్టర్ ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి అమలాపురం చేరుకున్నారు. కోనసీమ అంతటా పర్యటిస్తూ అధికారులను, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. రాజమహేంద్రవరంలోనే ఉండి తాత్కాలిక సెక్రటేరియట్ ఏర్పాటు చేశారు. అంధకారంలో మునిగిన కోనసీమలో విద్యుత్ కాంతులు వచ్చే వరకు, ప్రజలకు సహాయ చర్యలు అందే వరకు అవిశ్రాంతంగా శ్రమించారు. ఆయన చతురతకు తోడు అధికారులు, నేతల సహకారం ప్రజలకు కొంతమేర ఊరట కలిగించారు. నష్టం పూడ్చలేకపోయినా దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందించిన సాయం మాత్రం మరవలేనిది.

వ్యతిరేక దిశలో వచ్చి..

1996 నవంబరు 6న తుఫాను సమయంలో 160 నుంచి 200 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. మచిలీపట్నం వద్ద తీరాన్ని దాటాల్సిన తుఫాను వ్యతిరేక దిశలో కాకినాడను తాకడంతో ఈ విపత్తు సంభవించింది. సముద్ర తీర గ్రామాలైన బలుసుతిప్ప, భైరవపాలెం, పల్లం, ఎస్.యానాం, మొల్లేటిమొగ తుడిచి పెట్టుకుపోయాయి.

1.41 లక్షలు ఎకరాల్లో వరి పంట, 70,847 ఎకరాల్లో కొబ్బరి తోటలు, 11,960 ఎకరాల్లో అరటి, 3,544 ఎకరాల్లో చెరకు, 14,727 ఎకరాల్లో ఉద్యానవన, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. 3.57 లక్ష గృహాలు పాడయ్యాయి. రూ.3,677.29 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అంచనా వేసింది. 34 గ్రామాలు తుఫాను ప్రభావానికి గురికాగా 426 గ్రామాలు దెబ్బ తిన్నాయి. పెనుగాలులకు 1.76 లక్షల హెక్టార్లలో వరి, 12వేల హెక్టార్లలో పత్తి, 8వేల హెక్టార్లలో చెరకు దెబ్బతిన్నాయి. 291 హెక్టార్లలో కొబ్బరి దెబ్బతింది. 245 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్, కమ్యూనికేషన్, వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా పరిశ్రమలు, రైస్‌మిల్లులు, పేపరు మిల్లులు, ఆయిల్ మిల్లులు దెబ్బతిన్నాయి. కోళ్లఫారాలకు విపరీతమైన నష్టం కలిగింది. అప్పటి మంత్రి జీఎంసీ బాలయోగి, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ప్రజలు తుఫాను నుంచి కోలుకునే వరకు అహరహం శ్రమించారు.


సామర్లకోట భీమేశ్వర ఆలయంలో ఆకాశ దీపపూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా కార్తీకమాస పూజలు

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణ మధ్య అభిషేకాలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలలో కాకినాడకు చెందిన విశ్వవీరేశ్వరరావు దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్థంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజలలోనూ భక్తులు పాల్గొన్నారు.


హంస వాహనంగా రూపుదిద్దుకొంటున్న పంటు

సత్యదేవుడి తెప్పోత్సవ పంటుకు మరమ్మతులు పూర్తి

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 13న జరగనున్న సత్యదేవుడి తెప్పోత్సవానికి వినియోగించే హంసవాహన పంటుకు మంగళవారం మరమ్మతులు పూర్తిచేసి పండితులు ప్రత్యేకపూజలతో పంపా రిజర్వాయర్ గట్టువద్దకు చేర్చారు. బుధవారం నుంచి హంసవాహనం తయారీ పనులు చేపడుతున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలతో ఈనెల 10న హంసవాహనం ట్రయిల్‌రన్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గుర్రప్పాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం

● రెండు బైకులు ఢీ ● ఒకరు మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు


బైకులు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రగాయాలతో పడి ఉన్న క్షతగాత్రులు


మృతిచెందిన గోళ్ళ డానియేల్ (ఫైల్)

జగ్గంపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా జగ్గంపేట మండలంలోని గుర్రప్పాలెం గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే... గుర్రప్పాలెం గ్రామ శివారున ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జగ్గంపేట గ్రామానికి చెందిన గోళ్ళ డానియేల్, మరో నలుగురు వ్యక్తులు జగ్గంపేట నుంచి భావారం వెళ్లారు. అక్కడ ఏలేరు ప్రాజెక్టు సందర్శించి తిరిగి వస్తుండగా జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్తున్న మోర్త అప్పన్న, మోర్తసతీష్, యాకోబు ప్రయాణిస్తున్న బైక్‌ను డానియేల్ బైక్ బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గాయపడ్డ వారిని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఒక్కరే వైద్యుడు అందుబాటులో ఉండటంతో క్షతగాత్రులు పరిస్థితి వర్ణనాతీతం. విషయం గమనించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించేందుకు అంబులెన్స్‌ల కోసం ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం సభ్యులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది లేకపోవడంతో వాచ్‌మెన్ సెలైన్లు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆసుపత్రిలో వైద్య సేవలు అందే అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు కాకినాడ తరలించేందుకు ప్రయత్నించగా సాయంత్రం 6గంటలకు అంబులెన్స్ వచ్చింది. అంబులెన్స్‌లో కాకినాడ తరలించగా మార్గమధ్యలో గోళ్ళ డానియేల్ (24)మృతి చెందాడు. మోర్త సతీష్, మోర్త అబ్రహం యమగిరి, యాకోబు, సత్తరపు సతీష్‌లు జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్‌ఐ రఘునాధరావు తెలిపారు.




ఆసుపత్రిలో నర్సులు లేక క్షతగాత్రులకు సెలైన్ పెడుతున్న వాచ్‌మెన్, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న దృశ్యం



ఉల్లి..ధర లొల్లి!

● కర్నూలుకు రేటు రాదు ... మహారాష్ట్రకు పోటీ లేదు ● కర్నూలు ఉల్లి అందుబాటులోకి వచ్చినా తగ్గని ధరలు

● కర్నూలు రకం కేజీ రూ.25 లోపే, మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.70 పైనే

● మరి కొన్నాళ్లు ధరల భారం మోయాల్సిందే

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఉల్లిపాయల ధరలు మండుతూనే ఉన్నాయి. రోజులు, వారాలు కాదు ఏకంగా నెలల తరబడి రేటు నేలకు దిగిరావడంలేదు. కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్లోకి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ ఏమాత్రం తగ్గడంలేదు. మరోపక్క షోలాపూర్ రకం కొత్త ఉల్లిపాయలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయలేకపోతున్నాయి. రైతు బజార్లలో మహారాష్ట్ర ఉల్లిపాయలకు, కర్నూలు ఉల్లిపాయలకు మధ్య రేటు తేడా చూస్తే మహారాష్ట్ర ఎంత డామినేట్ చేస్తుందో అర్థమవుతుంది. రైతు బజార్లలో కర్నూలు రకం కేజీ రూ.26లు ఉంటే, మహారాష్ట్ర పాయలు కేజీ రూ.50ల ధర ఉంది. బహిరంగ మార్కెట్లో నాణ్యత కల్గిన మహారాష్ట్ర ఉల్లిపాయలు కేజీ రూ.60 నుంచి రూ.70 వరకూ విక్రయిస్తుండగా, కర్నూలు పాయలు మాత్రం రూ.25లు దాటకపోవడం గమనార్హం. షోలాపూర్ కొత్తపాయలు కూడా కేజీ రూ.30లోపే ఉన్నాయి. ఉభయగోదావరి, విశాఖపట్నం అర్బన్, కృష్ణా తదితర కొన్ని ప్రాంతాల ప్రజలు మహారాష్ట్ర రకం ఉల్లిపాయలను తప్ప ఇతర రకాలను వినియోగించరని, ఎంత రేటు ఉన్నా వాటినే కొంటారని, దీంతో మహారాష్ట్ర ఉల్లికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు విశ్లేషిస్తున్నారు.

● తాడేపల్లిగూడెం మార్కెట్‌కే కర్నూలు పాయలు ...

కర్నూలు రకం ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్ ప్రాచుర్యం పొందింది. ఇక్కడి నుంచే వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు కర్నూలు ఉల్లిని ఎగుమతి చేస్తారు. కర్నూలు ఏరియాలో ఎక్కువగా కాంట్రాక్టు ఫార్మింగ్ ఉంటుంది. దీంతో తాడేపల్లిగూడెంలోని కొంతమంది బడా హోల్‌సేల్ వ్యాపారులు కర్నూలు ప్రాంత రైతులకు ముందుగా అడ్వాన్సులు ఇచ్చి పంట చేతికొచ్చినప్పుడు సరుకును తీసుకొంటుంటారు. సాగుకు ముందే రైతులకు పెట్టుబడి పెట్టడంతో సరుకు డైరెక్టుగా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వస్తోంది. వీటిని ఇక్కడి హోల్‌సేల్ ట్రేడర్లు జార్ఖండ్, ఒడిశా, బీహార్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల్లోని సామాన్య, దిగువ మధ్యతరగతి వర్గాలు ఈ రకం పాయలను ఎక్కువగా వినియోగిస్తారని, మహారాష్ట్రతో పోల్చితే ధర కాస్త తక్కువ కావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కర్నూలు పాయలకు దిగువతరగతి వర్గాలే టార్గెట్‌గా వ్యాపారం సాగుతుంది. అలాగే జిల్లాలో సంతలు, స్థానికంగా నిర్వహించే చిల్లర మార్కెట్లకు తాడేపల్లిగూడెం మార్కెట్ నుంచి వ్యానుల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

● తొందరగా డ్యామేజీ ... నిలవకు ఆగవు ...

కర్నూలు ఉల్లి తొందరగా డ్యామేజీ అవుతుంది. నిలవకు ఆగదు. మహారాష్ట్ర ఉల్లిపాయలు నెలల తరబడి గొడౌన్లలో నిల్వచేసినా పాడవకుండా ఉంటాయి. కానీ కర్నూలు ఉల్లికి ఆ పరిస్థితి లేదు. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్టే ఆ రోజున్న రేటుకు హోల్‌సేల్ ట్రేడర్లు అమ్మేస్తుంటారు. అందువల్లే మహారాష్ట్ర పాయలను కొన్నంత ధైర్యంగా కర్నూలు పాయలను హోల్‌సేల్ ట్రేడర్లు కొనుగోలు చేయరని, వ్యాపారులకు వ్యాపారం తప్ప పబ్లిక్ ఇంట్రస్టు ఎక్కువగా ఉండదని చెబుతారు. నిజానికి కర్నూలు ఉల్లిపాయ చాలా బాగుంటుంది. ఘాటు ఎక్కువ, రుచి కూడా ఉంటుంది. గ్రేవీ కూడా ఎక్కువ వస్తుంది. కాకపోతే, ఉల్లిపాయ కాస్త ఎరుపు రంగులో ఉండడం, కూర వండిన తర్వాత కూడా కొంచెం ఎరుపుగా కనిపించడంతో చాలా మంది వీటిని ఇష్టపడరు. అలాగే, కర్నూలు పాయ చిన్నగా ఉంటుంది. మనకు ఆనదు. మహారాష్ట్ర నాసిక్ ప్రాంతంలోని ఉల్లిపాయ పెద్దగా ఉండి కంటికి ఆనుతుంది. ఈ విషయం హోల్‌సేలర్లకు తెలుసు కాబట్టి ట్రేడర్లు దీనిపైనే ఎక్కువ దృష్టి పెడతారు.

● నాసిక్ ఉల్లి కోసం మరికొన్నాళ్లు ఆగాల్సిందే ..

దీపావళి పండుగ తర్వాత మహారాష్ట్ర కొత్త ఉల్లిపాయలు మార్కెట్లోకి వస్తాయని అంతా భావించారు. హోల్‌సేల్ ట్రేడర్లు కూడా ఇదే చెబుతూ వచ్చారు. ఆమేరకు ఒక్క షోలాపూర్ ప్రాంతం నుంచి మాత్రమే కొత్త ఉల్లిపాయలు మార్కెట్లకు వస్తున్నాయి. మార్కెట్లో మంచి డిమాండ్ కల్గి, ఎక్కువ రోజులు నిల్వ ఉండే సరుకుగా పేరున్న నాసిక్ పరిసర ప్రాంతాల నుంచి ఉల్లి ఎప్పుడు వస్తుందనేది హోల్‌సేల్ ట్రేడర్లు సైతం చెప్పలేకపోతున్నారు. షోలాపూర్ రకం కొత్తపాయలు కావడంతో కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఎందుకంటే నాలుగైదు రోజుల కంటే ఎక్కువ నిల్వ ఉండవు. కర్నూలు ఉల్లితో పోల్చితే కాస్త బెటర్ అనిపించినా షోలాపూర్ ఉల్లి ఆరుదల పాయ కాకపోవడంతో కొనుగోళ్లు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ఇక కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్‌ను ముంచెత్తినా ధరలను ప్రభావితం చేసే పరిస్థితి లేకపోవడంతో ప్రజలకు ధరాభారం తప్పడంలేదు. అనంతపురం పంట వస్తుందని చెబుతున్నా కచ్చితమైన సమాచారం లేదు. షోలాపూర్ రకం మాదిరిగా అనంతపురం ఉల్లిపాయలు మీడియంగా ఉంటాయని, అవి మార్కెట్లకు వస్తే ధరలు కాస్త అదుపులోకి రావచ్చని భావిస్తున్నారు. గతంలో కర్నాటకలోని కోలార్ జిల్లాలో ఉల్లిసాగు చేసేవారు. అక్కడి రైతులు ఇతర పంటల వైపు మొగ్గు చూపడంతో అక్కడి నుంచి ఉల్లిపాయలు మార్కెట్లోకి రావడంలేదు. ఇవన్నీ సామాన్య, దిగువ మధ్యతరగతి ప్రజల ఉల్లి కష్టాలకు కారణంగా మారుతున్నాయి.

కలెక్టర్ రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నారు ...

● సునీల్ వినయ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

ఉల్లిపాయలతో పాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. జేసీ నేతృత్వంలో ధరల నియంత్రణ కమిటీ ఎప్పటి కప్పుడు మార్కెట్‌ను గమనిస్తూ సమీక్ష చేస్తోంది. ఇప్పటికే రైతు బజార్ల ద్వారా ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతు బజార్లలో ధరలు అదుపులో ఉంటేనే బహిరంగ మార్కెట్లో ధరలను నియంత్రించగలం. రేటు తక్కువగా ఉన్న కర్నూలు, షోలాపూర్ పాయలను కూరల్లో ఎక్కువగా వినియోగించాలి. తొందరలోనే మహారాష్ట్ర నాసిక్ రకం ఉల్లిపాయల ధరలు కూడా అదుపులోకి వస్తాయి అని ఆయన పేర్కొన్నారు.

సెంట్రల్ జైలు జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. బాపట్ల జిల్లా నాగారం గ్రామానికి చెందిన మన్నెం విజయ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుగా పనిచేస్తోంది. విజయ కొవ్వూరులోని మెరకవీధి వాటర్‌ట్యాంకువద్ద షేక్ బాషా ఇంటిలో అద్దెకు ఉంటోంది. అక్టోబరు 14వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని జైలు అధికారులు నవంబరు 1వ తేదీన ఇంటికి సమాచారం అందించారు. దీంతో విజయ సోదరి పాగోలు ఉదయభాస్కరమ్మ కొవ్వూరు వచ్చి ఇంటి యజమానిని చెల్లెలు గురించి ఆరా తీశారు. అక్టోబరు 11న ఊరు వెళ్తున్నాని చెప్పి ఇంటికి తాళంవేసి వెళ్లిందని, తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో ఉదయ భాస్కరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

భోజనం దగ్గర వివాదం

● ఒకరి హత్య

మోతుగూడెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): భోజనం విషయంలో ఇద్దరి మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన మంగంపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన మరిగెల అబ్బాయిరెడ్డి(41) దెబో చికెన్ షాపులో పనిచేస్తాడు. ఈనెల మూడున అక్కడ భోజనానికి అన్నం లేకపోవడంతో గ్రామంలో ఉన్న సోదరి నైని లక్ష్మి ఇంటికి వెళ్లాడు. ఆ ఇంట్లో అన్నం లేకపోవడంతో పక్కనే ఉంటున్న ఆమె కుమారుడు వెంకటరెడ్డి ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయానికి వెంకటరెడ్డి, ఆయన భార్య ఇంట్లో లేరు. అన్నం ఉండడంతో అబ్బాయిరెడ్డి తింటున్నాడు. ఇంతలో వచ్చిన వెంకటరెడ్డి ఆగ్రహంతో పీట తీసుకుని అతడి తలపై బలంగా కొట్టాడు. అబ్బాయిరెడ్డిని చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అబ్బాయిరెడ్డి మంగళవారం మరణించాడు. కేసును చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చింతూరు ఆసుపత్రిలో పసిబిడ్డ మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు
● ఐటీడీఏ ముందు బైటాయింపు


పసి బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమేనంటూ ఐటీడీఏ ముందు బైటాయించిన తల్లిదండ్రులు

చింతూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చదలవాడకు చెందిన కలుముల దుర్గారావు, బుల్లెమ్మల ఐదునెలల పసిబిడ్డ మంగళవారం అల్లూరి జిల్లా చింతూరు ఏరియా ఆసుపత్రిలో మృతి చెందింది. దుర్గారావు దంపతుల బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. మంగళవారం ఆ పసిబిడ్డ మృతి చెందింది. దీంతో ఆగ్రహానికి గురైన దుర్గారావు దంపతులు మృతి చెందిన తమ బిడ్డతో సహా ఐటీడీఏ కార్యాలయం ముందు బైటాయించారు. దుర్గారావు వెల్లడించిన వివరాలు.. తమ బిడ్డ అస్వస్థతకు గురవడంతో సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చామన్నారు. స్థానికంగా మెరుగైన చికిత్స అందించలేని పక్షంలో తమ బిడ్డను భద్రాచలం తరలించాల్సిందిగా వైద్యులను కోరామన్నారు. అవసరం లేదని ఇక్కడనే చికిత్స అందిస్తామని వైద్యులు చెప్పారని అన్నారు. చివరకు తమ బిడ్డ మృతి చెందిందన్నారు. సకాలంలో భద్రాచలం తరలించి నట్టైతే బిడ్డ బతికేదని దుర్గారావు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ బాధితులతో మాట్లాడారు. పూర్తి వివరాలు సేకరించి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకుంటానని తల్లిదండ్రులకు నచ్చ చెప్పారు.


మృతి చెందిన 5 నెలల పసిబిడ్డ

దీంతో బాధితులు దీక్ష విరమించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఐటీడీఏ వాహనంలో చదలవాడకు పీవో ఆదేశాల మేరకు సిబ్బంది తరలించారు.

తక్షణం సర్వే మొదలు పెట్టండి

● వైద్యశాఖకు ఐటీడీఏ పీవో ఆదేశాలు

పసిబిడ్డ మృతితో చింతూరు ఐటీడీఏ పీవో స్పందించారు. ఈ మేరకు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యకు పీవో పలు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో బాగంగా చింతూరు డివిజన్‌లో బుధవారం నుంచి ఇంటింటా సర్వే చేపట్టాల్సిందిగా ఆదేశించారు. చలి కాలం వచ్చినందున ఏడాదిలోపు బిడ్డల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయాలన్నారు. ఏ ఒక్కరి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోయినా వారిని తక్షణమే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలన్నారు. మరణాలు సంభవించకూడదన్నారు. ప్రతి సచివాలయంలో తన (ఐటీడీఏ పీవో)మొబైలు నెం. డిస్‌ప్లే చేయాలన్నారు. ఆరోగ్య స్థితిగతుల విషయంలో ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే తనకు ఫోన్ చేయాల్సిందిగా పీవో ప్రజలను కోరారు.

● మృతిపై విచారణ

చింతూరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఐదు నెలల పసిబిడ్డ మృతి చెందింది. ఈ మేరకు స్పందించిన పీవో ప్రకటన విడుదల చేశారు. మృతికి కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు స్పష్టమైతే చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాన్ నుంచి భారీగా మంటలు

● వ్యాన్ దగ్ధం ● డ్రైవర్ సహా నలుగురు క్షేమం


ఆలమూరులో మెయిన్‌రోడ్డులో దగ్ధమవుతున్న బొలెరో వ్యాన్

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో ప్రయాణిస్తున్న వ్యాన్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ఓఎన్జీసీకి చెందిన బొలెరా వ్యాన్ జొన్నాడ నుంచి పెదపళ్ల వద్ద ఉన్న జీసీఎస్ వద్ద వెళుతుండగా ఆలమూరు బ్యాంక్ సెంటర్ దాటగానే ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తో సహ నలుగురు ప్రయాణిస్తున్నారు. మంటలను గమనించిన వారు వ్యాన్ నుంచి దిగిపోవడంతో రోడ్డుపై వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. ఆ ప్రాంతం నుంచి కొంత ముందుగా వ్యాన్ నుంచి ఆయిల్ లీక్ అయినట్లుగా స్థానికులు చెబుతున్నారు. వ్యాన్ దగ్ధమవుతున్న సమయంలో మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను అదుపుచేసి ప్రమాదం వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. మండపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని వ్యాన్ మంటలు అదుపు చేసిన తరువాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

రంపచోడవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలోని స్వయం సహాయక సంఘాలు, గిరిజన ఉత్పత్తులకు ఆన్‌లైన్ గ్లోబల్ మార్కెటింగ్ సదుపాయం కల్పించే విధంగా ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేసినట్లు వెలుగు ఐటీ మేనేజర్ లంకే రామరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గిరి జన ప్రాంతంలో గిరిజనులు, డ్వాక్రా మహిళలు వివిధరకాల వస్తువులు, వెదురుఉత్పత్తులు, అల్లికలు, మిల్లెట్స్, చీపురు, పచ్చళ్లు తదితర వస్తువులు ఫ్లిప్‌కార్ట్, ఆమెజాన్ తరహాలో మై స్టోర్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అమ్ముకొనే విధంగా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. వస్తువుల వివరాలతో పాటు ఆధార్, పాన్, బ్యాంక్ ఎకౌంట్ వివరాలతో సమీపంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయం, రంపచోడవరం, టీపీఎం యూ హెడ్ క్వార్టర్ కార్యాలయంలో ఉచితంగా ఈకామర్స్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం, గిరిజన, డ్వాక్రా ఉత్పత్తులకు ఆదాయం సమకూరుతుందన్నారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

● సూర్యారావుపాలెంలో బాణసంచా ఘటనలో మరో ముగ్గురు మహిళలు మృతి

పెంటపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెల 30వ తేదీన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 6కు చేరింది. సంఘటనా స్థలంలోనే వేగరౌతు శ్రీవల్లి, గుమ్మడి సునీత మృత్యువాత పడగా రెండురోజుల తరువాత ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరావు మృతి చెందాడు. సోమవారం రావిపాడు గ్రామానికి చెందిన శీలం లక్ష్మి(45), మందలంక కమలరత్నం (47), దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి(53) ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శీలం లక్ష్మికి భర్త దుర్గారావు, కుమార్తె ఉండగా కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారికి భర్త లేదు. ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం

» షిర్డీ మ్యూజియంలో పనిచేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు.. కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇస్తానని చెప్పి డబ్బు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పాత పట్టిసీమకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నారపురెడ్డి కనకయ్య మధురపూడి ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. 2023 జూలై 6న కుటుంబ సభ్యులతో షిర్డీ వెళ్లాడు. అక్కడి మ్యూ జియంలో పనిచేస్తున్న అల్లాడి కునాల్ కశ్యప్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కనకయ్య భార్య వరలక్ష్మిని కశ్యప్ అక్కా అని పిలిచేవాడు. 2024 ఫిబ్రవరి 6న పట్టిసీమ ఇంటికి వచ్చి వధువు ఫోటోలు చూపించి పెళ్లి కుదిరిందని చెప్పి 2 వారాలు ఇంట్లో ఉన్నాడు. విదేశాల్లో కొంత బంగారం తక్కువ ధరకు లభించిందని, దానికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్లు చెల్లించాలని, బంగారానికి రూ.4,80,000 దఫదఫాలుగా ఫోన్‌పే ద్వారా ఎస్‌బీఐ అకౌంట్‌కి, బైక్‌కి సంబంధించి కొవ్వూరు బజాజ్ షోరూంలో రూ.86,000 చెల్లించారు. ఎంతకి బంగారం గాని, బైక్ గాని, ఇవ్వకపోవడంతో తీసుకున్న డబ్బు ఇవ్వాలని ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం చెప్పడం లేదన్నారు. విశాఖపట్నం ఆదిత్య ఆసుపత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి కనకయ్య విశాఖపట్నం ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కేసును కొవ్వూరు రిఫర్ చేశారు. దీనిపై కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు మరలా కేసునమోదు చేసినట్టు తెలిపారు.

సరిహద్దు దాటిన పులి

● అక్కడి నుంచి ఇక్కడకు - ఇక్కడి నుంచి అక్కడకు ● కారిడార్ విస్తరణ పనిలో నిరంతర కూంబింగ్‌లతో అంతరాయం? ● ఛత్తీస్‌గడ్‌లో రెండు ఆవులపై దాడి


బండ అటవీ ప్రాంతంలో పులి పాదముద్ర

చింతూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా పరోక్షంగా కన్పించిన పులి ఇరవై రోజులపాటు గిరిజనులను వణికించింది. అంతేకాదు నాలుగు ఆవులను కాపు కాచి చంపింది. ఇప్పుడు చింతూరు అటవీ డివిజన్ దాటి సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గడ్‌లో అడుగు పెట్టింది. అంతేకాదు సోమ వారం అక్కడ రెండు ఆవులను వేటాడింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో అలజడి మొదలైంది. అక్కడ కూడా పులి ప్రధాన రహదారిని ఆనుకుని సంచరించడం గమనార్హం. ఆ క్రమంలోనే కొందరి కంట పడింది. విషయం అటవీ అధికారులకు చేరింది. దీంతో అక్కడి అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సుక్మా డీఎఫ్‌వో అశోక్‌పటేల్ ఆదేశాలతో సిబ్బంది పులి పగ్‌మార్క్స్ (పాదముద్రలు) సేకరించారు. ఎనిమిది నుంచి తొమ్మిది అంగుళాల వరకు ఉన్నట్లు నిర్ధారణకొచ్చారు. కూనవరం అటవీ పరిధిలో సంచరించిన పులి పాదముద్రలు కూడా అవే కొలతలు కలిగి ఉన్న విషయం విదితమే. దీంతో మన ప్రాంతం నుంచి అక్కడకు చేరినట్లు అక్కడి అటవీ అధికారులు అంచనాకొచ్చారు. కూనవరం అటవీ పరిధిలో 40 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేసినప్పటికీ పులి కదలికలు కెమెరాలో చిక్కని విషయం కూడా తెల్సిందే. దాదాపు పదిహేనేళ్ల క్రితం కూనవరం, వరరామ చంద్రపురం మండలాల అటవీ ప్రాంతంలో పులి సంచరించింది. ఇన్నేళ్లకు మళ్లీ ప్రత్యక్షమైంది. చింతూరు డివిజన్‌తో పోల్చితే సుక్మా డివిజన్ లో అటవీ ప్రాంతం దట్టంగా ఉంటుంది. దీంతో పులుల సంచారం అక్కడ కొత్తేమీకాదు. అయితే ఇటీవల కాలంలో దండకారణ్యంలో మానవ సంచారం అధికమైంది. మావోయిస్టుల అణచివేతే లక్ష్యంగా అంతర్యుద్ధం సాగుతోంది. ఇందులో భాగంగా దండకారణ్యంలో ప్రతి ఐదు కిలోమీటర్ల దూరంలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. అదే దశలో అటవీ గ్రామాలకు రహదారులు, వంతెనల పనులు ముమ్మరంగా చేస్తున్నారు. అనంతరం దండకారణ్యంలో మునుపెన్నడూ లేని విధంగా మానవ సంచారం పెరిగింది. ఇది వన్య ప్రాణుల స్వేచ్ఛకు అంతరాయం కలిగిస్తోందన్న వాదన ఉంది. దీంతో పులితో పాటు ఇతర అటవీ జంతువులు సురక్షిత ప్రాంత అన్వేషణలో పడి ఉంటాయన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. పులి విస్తారంగా సంచరించడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. వన్యప్రాణి ప్రేమికుల అధ్యయనం మేరకు ఒక పులి తన సామ్రాజ్యాన్ని (కారిడార్) అటవీ ప్రాంతంలో 60నుంచి 100 కిలోమీటర్ల మేర వైశాల్యాన్ని ఎంపిక చేసుకుంటుంది. ఈ మేరకే పులి తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో తన కారిడార్ ఎంపిక కోసం సంచరిస్తుందన్న ప్రచారం సాగుతోంది.


పులి దాడిలో మృతి చెందిన ఆవు

కోతికి వైద్యం

మలికిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో ప్రమాదంలో గాయపడిన కోతికి వైద్య సేవలందించారు. రోడ్డుపై వెళుతున్న కోతిని మోటారు సైకిల్ ఢీకొనడంతో కాలికి గాయమై నడవలేని స్థితిలోకి వచ్చింది. కేశనపల్లికి చెందిన అడబాల నరసింహారావు స్పందించి పశువైద్య సిబ్బందితో కోతికి వైద్య సేవలు అందించారు.

8న 27అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు సెంటర్‌లో 27అడుగుల శ్రీఅభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఈనెల8న ప్రతిష్ఠ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ నుంచి మూడు రోజులు ప్రత్యేక పూజలు. 8న విగ్రహ ప్రతిష్ఠ, భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

మూసుకుపోయిన డ్రెయిన్లు



తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోయిన తూర్పులంక- మొగళ్ళమూరి డ్రెయిన్



అల్లవరం మండలం మొగళ్ళమూరి పరిధిలో ముంపు దిగక బీడుగా మారిన వరి పొలాలు

- అడ్డంకిగా మారిన తూడు
- ముంపు దిగక బీడుబారిన చేలు

అల్లవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆక్వా సాగు పెరిగిపోయి అల్లవరం మండల పరిధిలో పలు మైనర్, రెవెన్యూ డ్రెయిన్లు తూడు, గుర్రపు డెక్కతో మూసుకుపోయి ముంపు దిగక పంట నష్టాలు వాటిల్లుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మేజర్ డ్రెయిన్లలో కొంత వరకు గుర్రపుడెక్క తొలగించి న వాటి అనుబంధ డ్రెయిన్లలో తూడు అడ్డంకులు తొలగించక వరి సేద్యం రైతులకు శాపంగా మారింది. డ్రెయిన్లలో ముంపునీరు చేరి పంట కాలువలు కలుషితమయ్యాయి. మొగళ్లమూరి, దేవగుప్తం, కొమరగిరిపట్నం, తూర్పులంక, రెల్లుగడ్డ, తాడికోన, డి.రావులపాలెం పరిసర గ్రామాల్లో వరిచేలు బీడుగా మారాయి. ఊడ్చిన చేలతోపాటు ఊడ్చని చేలు కూడా ముంపు దిగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంపు కారణంగా మండల పరిధిలో పలు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలలో వరిపొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. డ్రెయిన్లలో ఆక్రమణలు పెరిగిపోయి ఆక్వా చెరువులను విపరీతంగా తవ్వేయడంతోపాటు డ్రెయిన్లలోకి సజ్జు వదలడంతో డ్రైనేజీవ్యవస్థ రూపుమారింది. ముంపు వరి రైతుల పాలిట శాపంగా మారింది. రెవెన్యూ డ్రెయిన్స్, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయ లోపంతో రైతులు వరిసాగును వదిలేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. మేజర్, మైనర్, రెవెన్యూ డ్రెయిన్లలో వలకట్లు తూడు అడ్డంకులు తొలగించి ముంపు దిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆనందరావుకు, కలెక్టర్, డ్రెయిన్స్ ఉన్నతాధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



అమలాపురం, ఉప్పలగుప్తం, పి.గన్నవరంలో నాగేంద్రుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యాలు, అల్లవరం: బోడసకుర్రులో నాగులపుట్ట వద్ద కోడిగుడ్డు మింగుతున్న భారీ త్రాచుపాము

అమలాపురం టౌన్/రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను పురస్కరించుకుని పిల్లాపాపలతో కలిసి పెద్దలంతా పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమయాలు నిర్దేశించడంతో ఉదయం నుంచి ఆయా పుట్టల వద్ద నాగులకు పూజలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. చలిమిడి, వడపప్పు, చిమ్మిలి, అరటిపండ్లు, కోడిగుడ్లు నైవేద్యంగా పెట్టారు. అమలాపురం, పట్టణ పరిసర ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు, పుట్టలు వద్ద భక్తులు బారులు తీరారు. పట్టణంలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు పూజాభిషేకాలు నిర్వహించారు. బండారులంక శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి, ఎ.వేమవరం, నడిపూడి మెట్ల రాంజీ కాలనీలో కొలువుతీరిన పుట్ట ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని పుట్టవద్ద, ఎన్టీఆర్ మార్గ్‌లోని మానసాదేవి ఆలయ ప్రాంగణంలోను వందలాది మంది భక్తులు పూజలు జరిపారు. విద్యుత్‌నగర్‌లోని ఆదిశేషా నిలయంలో అక్షయపాత్ర ఆధ్వర్యంలో ద్వాదశ దిశల్లో అనంత, వాసుకి, శేష, పద్మాయ, కంబళ, కర్కోటక తదితర నాగాలను ప్రతిష్ఠించి విశేష నాగపూజ నిర్వహించారు. భక్తులు నాగసాధన చేశారు. 22కిలోల శ్రీవారాహీ మహాకంద దీపాన్ని భక్తుల దర్శనార్థం ఉంచారు. నాగరాజం వద్ద విశేష దీపాలంకరణ చేశారు. దుడ్డువారి అగ్రహారంలో బాల విద్యార్థి గణపతి సంఘం ఆధ్వర్యంలో చవితి వేడుకలు నిర్వహించారు.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగేంద్రునికి అత్యంత ప్రీతికరమైన రోజు మంగళవారం రోజున నాగులచవితి రావడంతో భక్తులు నాగులచవితిని అత్యంత ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి ఆలయాల్లో, పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు నిర్వహించారు. పాలు, బుర్రగుంజు, తేగలు, చలిమిడి, చిమ్మి, కోడిగుడ్లను నైవేద్యంగా సమర్పించారు. పిల్లా పాపలతో కుటుంబ సభ్యులంతా నాగేంద్రుడికి పూజలు జరిపించారు. ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు జరిపించారు.

మామిడికుదురు, ఆంధ్రజ్యోతి: నాగులచవితి వేడుకలను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టలో పాలువేసి నాగరాజుకు గుడ్లు సమర్పించి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాల్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పాముల పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. పెదపట్నం, మామిడికుదురు, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో గల సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల వద్ద ప్రత్యేకంగా చేశారు.

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొండెపులంక లాకు, లంకలగన్నవరం, అక్విడెక్టు వద్ద గల పుట్టల వద్దకు భక్తులు పోటెత్తారు. నాగేంద్రుడికి పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లో సుబ్రహ్మణ్యే శ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మలికిపురం (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మలికిపురం, రామరాజులంక, లక్కవరం, కేశనపల్లి తదితర ప్రాంతాల్లో పుట్టల్లో పాలు పోసి చలిమిడి, చిమ్మి, తేగలు, గుడ్లు వంటి వాటిని నివేదించారు.

అంబాజీపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పొలాల్లో, ఆలయాల్లో వెలిసిన పాము పుట్టల్లో పాలు, గుడ్లు, చలివిడి, చిమ్మి వేసి పూజలు నిర్వహించారు. మాచవరం, పుల్లేటికుర్రులోని వల్లిదేవసేన సుబ్రహ్మణేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. కార్తీకమాసం సందర్భంగా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

రాజోలు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నాగులచవితి వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పొలాలు, తోటల వద్దనున్న పుట్టల వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు పుట్టల వద్ద దీపారాధనలు చేసి నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు. పుట్టలో పాలు, గుడ్లు, తేగ, బుర్రగుంజు, చిమ్మి వంటివి సమర్పించి పూజలు చేశారు. పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించారు.

ఐ.పోలవరం, ఆంధ్రజ్యోతి: మండలంలోని ప్రజలు మంగళవారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మురమళ్ళలో వల్లీదేవసేన సమేతసుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. మండలంలో గ్రామగ్రామాన నాగులచవితి పూజలు ఘనంగా జరిగాయి. పుట్టల వద్ద పిల్లలు బాణసంచా కాల్చారు.

ఉప్పలగుప్తం (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గ్రామగ్రామాన మంగళవారం నాగులచవితి పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతు కుటుంబాలు తమ పొలాల్లోని పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పాముల పుట్టల ప్రదేశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. గొల్లవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి, వాడపర్రు, సన్నవిల్లి, ఉప్పలగుప్తం, చినగాడవిల్లి, మునిపల్లి, ఎస్.యానాం, చల్లపల్లి, గోపవరం, వానపల్లిపాలెం, ఎన్.కొత్తపల్లి గ్రామాల్లో నాగులచవితి వేడుకలు జరిగాయి.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసకుర్రు శివారు దేవర్లంకలో పుట్ట కలుగు నుంచి భారీ తాచుపాము భక్తులు వేసిన కోడిగుడ్లు మింగుతున్న దృశ్యాలు భక్తులను ఆనందపరవశం చేసింది. కొబ్బరితోటలు, కాలువగట్లు, ఏటిగట్ల వద్ద పాముల పుట్టల వద్ద అధిక సంఖ్యలో మహిళలు పూజలు చేశారు. బోడసకుర్రు, కొమరగిరిపట్నం, అల్లవరం గుడ్డివానిచింత గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బోడసకుర్రు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం పక్కన పుట్ట వద్ద ప్రత్యేక పూజలు జరిపారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానంలోని క్షేత్రపాలకుని ఆలయం పక్కన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం, అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, వీవీ మెరక, అప్పనరామునిలంక గ్రామాల్లో మహిళలు పుట్టల వద్ద పాలు, గుడ్లు సమర్పించారు. నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు.

పంటరుణాల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఈలి శ్రీనివాస్

మామిడికుదురు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రాథమిక, వ్యవసాయ పరపతి సంఘాల వద్ద తీసుకున్న పంట రుణాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడుకు మంగళవారం రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ అందించారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ హయాంలో రూ.లక్ష పంట రుణానికి సున్నా శాతం వడ్డీ అమలుచేసి, వడ్డీ లేకుండా పంట రుణాలను రెన్యువల్ చేసేవారని, గత ప్రభుత్వం ఈవిధానాన్ని రద్దు చేసి వడ్డీతో సహా రుణం చెల్లించినా కేంద్ర ప్రభుత్వం నుంచి మూడు శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 4శాతం వెరసి 7శాతం వడ్డీ రాయితీ ఇస్తామని తెలిపి ఏ విధమైన రాయితీ ఇవ్వలేదన్నారు. వినతిపత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు అందించారు. కార్యక్రమంలో నాయకులు సాపే ఏకాదశి, అప్పారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

104 సిబ్బంది నిరసన

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ముమ్మిడివరంలో 104 సిబ్బంది కొత్తలంక పీహెచ్‌సీ వద్ద నిరసన చేపట్టారు. అరవింద్ యాజమాన్యంలో చెల్లించాల్సిన జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని, 104 సర్వీసులను గతంలో మాదిరిగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, అలా నిర్వహించడం వల్ల రూ.50వేలు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. 2020లో విధుల్లోకి చేరిన ఉద్యోగులకు జీవో నంబరు-7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఇన్సూరెన్సు చేయించాలని వారు డిమాండు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.విజయ్, ఎస్.సతీష్‌ల ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ ముకుందకు అందజేశారు.

అంబాజీపేట, నవంబరు 5(ఆంధ్రజోతి): పెండింగ్ జీతాలను తక్షణం చెల్లించాలని 104 ద్వారా సేవలు అందిస్తున్న సిబ్బంది డిమాండ్ చేశారు. గంగలకుర్రు అగ్రహారంలో వైద్యాధికారి గౌతమికి జిల్లా 104 వైద్యసేవల ప్రధాన కార్యదర్శి పితాని త్రిమూర్తులు, ఉపాధ్యక్షురాలు రాజకుమారి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. గతంలో మాదిరిగానే పీహెచ్‌సీల ద్వారా 104 సేవలు నిర్వహించాలని కోరారు. 2020లో జాయిన్ అయిన ఉద్యోగులకు జీవో నెం.7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల నుంచి చెల్లించని ఇంక్రిమెంట్లు ఏరియర్స్ రూపంలో ఇప్పించాలని కోరారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మూడు నెలల బకాయిలు చెల్లించాలంటూ 104లో ఉద్యోగాలు మంగళవారం నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు స్వర్ణలత, స్పందనలకు వినతిపత్రం అందించారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం 104సిబ్బంది పీహెచ్‌సీ వైద్యాధికారిణి టి.ఇంద్రశ్రీకి వినతిపత్రం అందజేశారు. డీఈవో సీహెచ్‌బీవీ నారాయణ, డ్రైవర్ ఎం.అంకాలు వినతిపత్రాలు అందించారు. జీతాల చెల్లింపు, పీహెచ్‌సీల ద్వారా సర్వీసుల నిర్వహణ, పీఎఫ్, ఈఎస్‌ఐలలో ప్రభుత్వ వాటా చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలంటూ 104 సిబ్బంది రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం ఉప్పలగుప్తంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 104 సిబ్బంది యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుసుమ ఓంప్రకాష్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యజ్యోతికి వినతిపత్రం సమర్పించారు. గతంలో మాదిరిగా 104 సర్వీసులను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 2020లో చేరిన సిబ్బందికి జీవో నెం.7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, బాకీ ఇంక్రిమెంట్లు చెల్లించాలని, స్లాబ్‌సిస్టమ్ అమలు చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై సమావేశాలు

పి.గన్నవరం, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓట్లకు సంబంధించి గతంలో ఓటు వేసిన వారు కూడా మళ్లీ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవి సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామస్థాయి సిబ్బందితో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్‌తో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. నేటితో ఆన్‌లైన్‌లో ఓటు హక్కు నమోదు ప్రక్రియ ముగిసిందన్నారు. వచ్చేనెల9వరకు ఆఫ్‌లైన్‌లో ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల20న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామన్నారు. ఈనెల23 నుంచి డిసెంబరు 9వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోమవారం వరకు మండల వ్యాప్తంగా 1235 దరఖాస్తులు వచ్చాయన్నారు. పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం మంగళవారం చురుగ్గా జరిగింది. ఓటు నమోదులో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, మాజీ ఎంపీపీ గుండుబోగుల గంగాభవానీ, పిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు సంబంధించి ఓట్ల నమోదుకు కూటమి నాయకులు మంగళవారం గ్రామాల వారీగా ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు చోడిశెట్టి బ్రహ్మానందం, కోళ్ళ భద్రం, పేరాబత్తుల బాబి, మింగి కృష్ణ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు ఐ.పోలవరం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం మండలాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహదశ లక్ష్మీనారాయణ, కొమ్మిరెడ్డి చంద్రరావు, మహదశ ఆంజనేయులు, కొమ్మిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును అడ్డుకోవాలి



ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును అడ్డుకోవాలని కోరుతూ ఎన్డీఏ కూటమి ముస్లిం నాయకులు ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మీరాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో కూటమి ముస్లిం నాయకులు మంత్రిని కలిసి ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి హాజీ ముఖర్రం హుస్సేన్, ఎండీ అమీర్, సాధక్ హుస్సేన్, మీరా ఖాసిం హుస్సేన్, ఎండీ బషీర్, సర్కిల్‌రాజా, అబ్బాస్, మహ్మద్ షఫీఉల్లా, మహ్మద్‌ఆలీ, ఎస్కే బాషా తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో పలువురు మంత్రికి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతో పాటు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గతంలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను పునరుద్ధరించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ మాడా మాధవితో పాటు పలువురు పాల్గొన్నారు.

8న లబ్ధిదారుల గుర్తింపునకు శిబిరం

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో దివ్యాంగుల ఉపకరణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ కార్డు, టచ్‌ఫోన్ కొరకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.


రూ.30,300 విరాళం

అయినవిల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని రాజమహేంద్రవరానికి చెందిన మద్దిపట్ల గోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.30,300 విరాళంగా సమర్పించారు.

24,25 తేదీల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

కాట్రేనికోన, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చిలకాయిచెరువులో స్టేట్ వాలీబాల్ ప్లేయర్ మోర్త ప్రతిష్ఠ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్‌పోటీల బ్రోచర్‌ను మంగళవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, వెంట్రు సుధీర్, సర్పంచ్ దంతులూరి సీతారామకృష్ణంరాజు, విత్తనాల వెంకటరమణ, సర్పంచ్ గోకరకొండ గౌరీ పార్వతీసుబ్బలక్ష్మి, కంచర్ల కృష్ణ, పిన్నమరాజు రంగరాజు, గంగుమళ్ళ భాను పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



నడిపూడిలో నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

అమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యాలయ భవనం నిర్మాణానికి అనువైన మూడు స్థలాలను గుర్తించినట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. నడిపూడి వద్ద సుమారు రెండు ఎకరాల ఇరిగేషన్ పోరంబోకు స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. జిల్లా కార్యాలయ నిర్మాణానికి ఆ స్థలం అనువైనదిగా కొందరు నాయకులు చెప్పారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

ఐ.పోలవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో విద్యార్థినుల పట్ల ఒక ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఒక ఉపాధ్యాయుడు హైస్కూల్లో చదువుకుంటున్న హాస్టల్ విద్యార్థినుల పట్ల కొంత కాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. విద్యార్థినుల ఫిర్యాదుతో మంగళవారం ఎస్‌ఐ మల్లిఖార్జునరెడ్డి, మహిళా ఎస్‌ఐ శశాంక్, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీలతో కూడిన అధికారుల బృందం హాస్టల్‌కు వెళ్లి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా కాట్రేనికోన, జి.వేమవరం పాఠశాలల్లో పని చేస్తుండగా ఈవిధమైన ఆరోపణలతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండైనట్టు సమాచారం.

డీఈవో విచారణ: ఐ.పోలవరం హైస్కూల్లో వసతిగృహ విద్యార్థినులపై ఉపాధ్యాయుడు వేధింపుల ఘటనపై డీఈవో షేక్ సలీంబాషా మంగళవారం విచారణ నిర్వహించారు. పాఠశాలలో ఉపాధ్యాయులను, విద్యార్థులను విచారించి వివరాలు సేకరించారు. ఆ ఉపాధ్యాయుడు గతంలో రెండ సార్లు సస్పెండయ్యారని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళకు చెందిన గోకవరపు సూర్యనారాయణ, సత్యనాగమణి దంపతులు వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.10,116 విరాళం ఇచ్చారు.

అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగిన అప్పనపల్లి



అయ్యప్పస్వామి కలశల పూజ చేస్తున్న స్వాములు

మామిడికుదురు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామం సోమవారం రాత్రి అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. గ్రామానికి చెందిన తులా శ్రీను, చిన్నస్వామి నివాసం వద్ద అయ్యప్పస్వామి 18కలశల పూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప స్వాములు పేటతుళ్లి ఆడుతూ మేళతాళాలు, బాణసంచా కాల్పుతో కలశాలతో వైనతేయ నదికి ఊరేగింపుగా వెళ్లారు. వైనతేయ నదీ జలాలను కలశాలతో తీసుకువచ్చి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదపట్నం గ్రామానికి చెందిన గురుస్వామి జయంతి సుబ్బారావు ఆధ్వర్యంలో వినాయకునికి, సుబ్రహ్మణ్యేశ్వరునికి, కనకదుర్గమ్మకు పూజలు జరిపారు. తిరువూరి సాయి నరసింహమూర్తి మాలధారులతో ప్రత్యేక పూజ చేయించి అయ్యప్పస్వామికి పంచామృతాలు, పుష్పాలతో అభిషేకాలు చేశారు. మానేపల్లికి చెందిన కాలిశెట్టి ప్రకాష్ గురుస్వామి ఆలపించిన అయ్యప్ప గీతాలు, భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో కొబ్బరి పారిశ్రామిక పార్కు



తూర్పుపాలెంలో కోకోనట్ పార్కు ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో కొబ్బరి పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయడం ద్వారా ఈప్రాంత రైతులకు మేలు చేసినట్టు అవుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో పార్కు ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు 25ఎకరాలు కావాలని, దీనికి అనువైన ప్రాంతం తూర్పుపాలెమని, దీనికి సంబంధించిన కోఆపరేటివ్ సొసైటీకి చెందిన భూములను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక పార్కుల విధానం, కేంద్ర ప్రభుత్వ సహకారం జోడించి ఎంఎస్ఎంఈ పార్కు తూర్పుపాలెంలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సంప్రదించగా, ఆ కార్పొరేషన్ అంగీకారం తెలిపిందన్నారు. పార్కు ఏర్పాటుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.

రమణబాబుకు సముచిత స్థానం కల్పిస్తాం



రమణబాబు స్వగృహం వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుకు సముచిత స్థానం కల్పిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీనిచ్చారు. రమణబాబు స్వగృహం వద్ద ప్రజాప్రతినిధుల సన్మానోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురం ఒక గ్రామంలా కనిపిస్తోందన్నారు. అమలాపురం పట్టణ రూపురేఖలు మార్చే విధంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులను సమన్వయం చేసుకుని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అచ్చెన్నాయుడుతో పాటు మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లను సన్మానించారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన

అమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామనగరువు బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన మద్యం షాపును తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని డిమాండు చేస్తూ ఆమని ట్రేడర్స్, ఆమని ఆటో ఏజెన్సీస్‌లో పనిచేసే కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు పాల్గొన్నారు.

వంటగ్యాస్ లీకై అగ్నిప్రమాదం

ఉప్పలగుప్తం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూనవరం మేజర్ డ్రెయిన్ వద్ద మంగళవారం ఉదయం బూసి రాజేంద్రప్రసాద్, సత్యనారాయణలకు చెందిన తాటాకింట్లో నిర్వహిస్తున్న కాఫీ హోటల్‌లో వంట గ్యాస్ లీకవ్వడంతో ప్రమాదం జరిగింది. తాటాకిల్లుతో పాటు కుంచే వెంకటరమణకు చెందిన టైలరింగ్ షాపు దగ్ధమైంది. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రించారు. రూ.5లక్షలు నష్టం ఉంటుందని అంచనా.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. చిరతపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సర్పంచ్ కోట బేబీరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఉద్యాన రైతులకు ప్రభుత్వం ప్యాక్‌హౌస్‌లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఏఈవో డి.దుర్గారావు, వీహెచ్ఏ రవితేజ, వెటర్నరీ అసిస్టెంట్ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోమలి విత్తనాలతో నిండా మునిగాం

అమలాపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు సంపద సీడ్స్ షాపులో కొనుగోలు చేసిన కోమలి ప్యాడీ సీడ్స్‌ను వినియోగించి నిండా మునిగిపోయారని వివరిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కొత్తపేట మండల పరిధిలోని పెదగూళ్లపాలెం, చినగూళ్లపాలెం, మట్లదొడ్డి, పనసలదొడ్డి, పలివెల గ్రామాలకు చెందిన రైతులు 300ప్యాకెట్ల విత్తనాలను అదే షాపు నుంచి కొనుగోలుచేసి 600ఎకరాల్లో సాగు చేపట్టారని పంట మొత్తం కేళీలు వచ్చాయని వివరించారు. జరిగిన నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు, సంబంధిత కంపెనీ యాజమాన్యానికి కూడా వివరించామన్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిపించాలని రైతు ప్రతినిధులు చీకట్ల ప్రసాద్, కె.సత్యనారాయణ, ఎం.నాగరాజు అర్జీ అందించారు.

అత్యాచార ఘటనలో యువకుడిపై కేసులు నమోదు

పి.గన్నవరం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒక గ్రామంలో బాలికపై అత్యాచారం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై అదే గ్రామానికి చెందిన యువకుడిపై వివిధ సెక్షన్లు కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. బాలికను పెళ్లి చేసుకుంటానని షేక్‌అజేయ్ నమ్మించి మోసం చేయడం, కులం పేరుతో దూషించడంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారం కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. డీఎస్పీ గోవిందరావు విచారణ చేపట్టారు.

కోతికి వైద్యం

మలికిపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో ప్రమాదంలో గాయపడిన కోతికి వైద్య సేవలందించారు. రోడ్డుపై వెళుతున్న కోతిని మోటారు సైకిల్ ఢీకొనడంతో కాలికి గాయమై నడవలేని స్థితిలోకి వచ్చింది. కేశనపల్లికి చెందిన అడబాల నరసింహారావు స్పందించి పశువైద్య సిబ్బందితో కోతికి వైద్య సేవలు అందించారు.

8న 27అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు సెంటర్‌లో 27అడుగుల శ్రీఅభయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఈనెల8న ప్రతిష్ఠ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ నుంచి మూడు రోజులు ప్రత్యేక పూజలు. 8న విగ్రహ ప్రతిష్ఠ, భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

గట్టెక్కని వరి పంట.. రైతులకు తీరని కష్టాలు

- పలు చోట్ల కోతలు ప్రారంభం
- పెట్టుబడులు రాని పరిస్థితి
- ఆందోళన చెందుతున్న రైతులు




మాచర వద్ద కోతకు రాని వరి పంట, మాచర సమీపంలో కోసిన వరిపంటను కట్టలు కడుతున్న కూలీలు

కపిలేశ్వరపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట ఇకా గట్టెక్కలేదు. మండలంలో 15,770 వరి పంట సాగు చేయగా దానిలో 60శాతం వెదజల్లు విధానం, 40శాతం నాట్లు విధానం ద్వారా రైతులు సాగుచేశారు. ప్రస్తుతానికి 150 ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారి రమేష్‌కుమార్ తెలిపారు. అయితే ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పలు చోట్ల చేలు నేలనంటాయి. మరి కొన్ని చోట్ల పంట కోతకు రాగా కొన్ని ప్రాంతాల్లో పంట చివర దశకు చేరుకుంది. వరి పంట ప్రారంభం నుంచి అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు పూర్తిస్థాయిలో చేతికి వచ్చే పరిస్థితి లేదని, పలుసార్లు నీటి ఎద్దడి, చేలుకు తెగుళ్ళు వంటి కారణంగా మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చిందని, దీంతో లాభాలు మాట ఎలాఉన్నా కనీసం పెట్టిన పెట్టుబడులు వస్తే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో పలు చోట్ల ఇటీవల కోతలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల నేలనంటిన చేలు, మరికొన్ని చోట్ల కోతలు పట్టడం, కొన్నిచోట్ల మాసూళ్ళు చేయడం వంటి పనులు కొనసాగుతున్నాయి. మరోపక్క తుఫాను హెచ్చరికలు జారీ అవుతున్న నేపథ్యంలో రైతులు మరింత బెంబేలెత్తిపోతున్నారు. దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో పంటనగదు జమచేసేలాగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాచరమట్ల వద్ద ధాన్యాన్ని ఎగురవేసి ఒబ్బిడిచేసుకుంటున్న రైతులు

భూసమస్యలు పరిష్కారం చేసుకోండి

కె.గంగవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భూసర్వేలో వచ్చిన సమస్యలు పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుం జయరావు అన్నారు. మంగళవారం కడుపూరులో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి దరకాస్తులు స్వీకరించారు. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ పిల్లి రాంబాబు, డిప్యూటి తహశీల్దార్ మురళి, సర్వేయర్ పావని, ఆర్.ఐ. వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెంలో ఇన్‌చార్జి మంత్రికి స్వాగతం

రావులపాలెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులై తొలిసారిగా జిల్లాకు వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడుకు రావులపాలెంలో ఘనస్వాగతం లభించింది. విజయవాడ నుంచి రోడ్డు మార్గంలో అమలాపురంలో జరిగే పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనకు స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజులతో పాటు కూటమి శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి అమలాపురంలో జరిగే సమావేశానికి ఆయన తరలివెళ్లారు.



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బండారు, పార్టీ నేతలు

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై సమావేశం



సమావేశమైన కూటమి నాయకులు

ద్రాక్షారామ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సోమవారం ఎన్‌డీఏ కూటమి నాయకులు సమావేశం ద్రాక్షారామలో జరిగింది. ఆన్‌లైన్‌లోను ఓటరు నమోదు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు కోరారు. సమావేశంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టి.డి.పి నాయకులు పెంకె సాంబశివరావు, కొత్తపల్లి శ్రీను, పితాని వీరభద్రరావు, జనసేన నాయకులు పోతాబత్తుల విజయకుమార్, సంపతి సత్యనారాయణ, గుబ్బల శ్రీను, అల్లకరాజు, చవ్వాకుల సత్తిబాబు బీజేపీ నాయకులు ఆకేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ గ్రామసభలు

కపిలేశ్వరపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గతనెల 19న ప్రారంభమైన రెవెన్యూ గ్రామసభలు మంగళవారంతో ముగిసాయి. మంగళవారం మాచర రైతుసేవాకేంద్రం వద్ద గ్రామసర్పంచ్ వాసంశెట్టి సునీత విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ చిన్నారావు మాట్లాడారు. భూసమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. గ్రామఉపసర్పంచ్ అడపా వేణుబాబ్జీ, వీఆర్‌వో రాజారత్నం, రైతులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ లీకై అగ్నిప్రమాదం

ఉప్పలగుప్తం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూనవరం మేజర్ డ్రెయిన్ వద్ద మంగళవారం ఉదయం బూసి రాజేంద్రప్రసాద్, సత్యనారాయణలకు చెందిన తాటాకింట్లో నిర్వహిస్తున్న కాఫీ హోటల్‌లో వంట గ్యాస్ లీకవ్వడంతో ప్రమాదం జరిగింది. తాటాకిల్లుతో పాటు కుంచే వెంకటరమణకు చెందిన టైలరింగ్ షాపు దగ్ధమైంది. ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బంది మంటలను నియంత్రించారు. రూ.5 లక్షలు నష్టం ఉంటుందని అంచనా.

8న లబ్ధిదారుల గుర్తింపునకు శిబిరం

ముమ్మిడివరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో దివ్యాంగుల ఉపకరణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ కార్డు, టచ్‌ఫోన్ కొరకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన

అమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కామనగరువు బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన మద్యం షాపును తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని డిమాండు చేస్తూ ఆమని ట్రేడర్స్, ఆమని ఆటో ఏజెన్సీస్‌లో పనిచేసే కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

గ్రావెల్ లారీలను అడ్డుకున్న స్థానికులు



ద్వారపూడిలో గ్రావెల్ క్వారీ లారీలను అడ్డుకుంటున్న స్థానికులు

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో రహదారులపై అధిక లోడుతో గ్రావెల్ తరలిస్తున్న లారీలను నియంత్రించి, గ్రామంలో రహదారులు దెబ్బతిన కుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గ్రావెల్ లారీలను స్థానికులు అడ్డుకున్నారు. గ్రామంలో క్వారీ లారీలు రావ్వని క్వారీ నిర్వాహకులు హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసామని వారు తెలిపారు. బుధవారం గ్రామానికి వచ్చే కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని గ్రామస్తులు తెలిపారు.

ప్రొఫెసర్ మూర్తికి రామానుజన్ స్మారక గణిత అవార్డు



రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు5(ఆంధ్రజ్యోతి):రామానుజన్ గణిత అకాడమీ 2024 రామానుజన్ స్మారక గణిత అవార్డుకు ఖరగ్‌పూర్ ఐఐటి గణిత ఆచార్యులు డా.పి.వి.ఎస్.ఎన్.మూర్తిని ఎంపిక చేసినట్లు రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ తెలిపారు. ప్రొఫెసర్ మూర్తి ఎంఎస్సీ ఉస్మానియా యూనివర్శిటీలో, పీహెచ్‌డీ ఖరగ్‌పూర్ ఐఐటీలో పూర్తిచేసినట్లు వివరించారు. మూర్తి పర్యవేక్షణలో 14మంది పీహెచ్‌డీలు పొందినట్లు తెలిపారు. దక్షిణకొరియా, దక్షిణాఫ్రికా, ఫ్లోరిడా, జపాన్, చైనా, హాంగ్‌కాంగ్ తదితర దేశాల్లో పలు గణిత సెమినార్లలో పాల్గొని దేశఖ్యాతిని ఇనుమడింప చేశారన్నారు. రామానుజన్ గణిత అకాడమీ ప్రతీఏటా నిర్వహించే జాతీయవార్షికోత్సవ సదస్సు డిసెంబరు 15న నిర్వహిస్తామని సదస్సులో ప్రొఫెసర్ మూర్తికి రామానుజన్ స్మారకగణిత అవార్డు బహూకరిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ పి.వి.ఎస్.ఎన్.వ.మూర్తిని రామానుజన్ స్మారక గణిత అవార్డుకు ఎంపిక చేయడం పట్ల రామానుజన్ గణిత అకాడమీ సభ్యులు నాగార్జున, రేవతి సైన్సు ఫౌండేషన్ కె.శ్రీకృష్ణసాయి హర్షం వ్యక్తం చేశారు.

రూ.30,300 విరాళం

అయినవిల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని రాజమహేంద్రవరానికి చెందిన మద్దిపట్ల గోపాలకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.30,300 విరాళంగా సమర్పించారు.

నేడు రాయవరంలో మునసబు వర్ధంతి

రాయవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాదాత, మాజీ ఎమ్మెల్సీ ఉండవిల్లి సత్యనారాయణమూర్తి (రాయవరం మునసబు) వర్ధంతి బుధవారం నిర్వహించనున్నట్లు టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు మంగళవారం తెలిపారు. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక చేనేత సహకారసంఘం వద్ద, స్థానిక దళితపేటలో ఉన్న మునసబు విగ్రహాలకు మునసబు అభిమానులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించనున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమానికి మునసబు అభిమానులు, పాఠశాల పూర్వ విద్యార్థులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

8న శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ

కపిలేశ్వరపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాచరలో ఈనెల8న 45 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6న విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షధారణ, ప్రతిష్టాసంకల్పం, అకల్మషహోమం, పుట్టమట్టి తెచ్చుట, యాగశాల ప్రవేశం, యాగమందిరపూజ, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తుహోమం, 7న వేదస్వస్తి, పంచగవ్యారాధన, గోదృష్టి, అగ్నిప్రతిష్టాపన, మహాశాంతి హోమం, చతుర్థశ కలశాభిషేకం, జలాధివాసం, హోమాలు జరుగుతాయన్నారు. 8న పండితులు పెదపూడి లక్ష్మీజనార్ధనమూర్తి కుమారుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం వాస్తవ్యులు పెద్దింటి లక్ష్మణాచార్యులు బ్రహ్మత్వంలో కరెడ్ల శ్రీనివాసు, సత్య దంపతుల యాజమాన్యంలో ప్రతిష్టాయజ్ఞ మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి సెన్సెస్ (నైపుణ్య సంస్థ కార్పొరేషన్ ఇచ్చే) శిక్షణకు సంబంధించి మండపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావు మంగళవారం సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్కిల్‌డెవలప్‌మెంట్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆయన వివరించారు. పట్టణంలో ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి ఎన్యుమరేటర్లు సమాచారం సేకరించాలని ఆయన ఆదేశించారు. ఇంటింటా సర్వే చేసిన పుడు 15నుంచి 59ఏళ్లలోపు వారి సమాచారాన్ని నైపుణ్య యాప్ ద్వారా పొందుపరచాలని ఆయన సూచించారు. ఈసర్వేకు పట్టణ ప్రజలు ఉద్యోగులకు సహకరించాలని ఆయన కోరారు. సచివాలయ ఉద్యోగులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

లొల్లలో కంటి వైద్య శిబిరం

రాయవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): లొల్ల ఎంపీపీ యూపీ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండపేట నియోజకవర్గ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎస్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 మంది విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు జరిపి 5మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని సిఫార్సు చేసినట్లు చెప్పారు. మండలంలోని ఇప్పటి వరకు లొల్ల, మాచవరం, చెల్లూరు, కుర్మాపురం, వెంటూరు, పసలపూడి గ్రామాల్లో 1715 మంది విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి 100 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని సిఫార్సు చేసినట్లు చెప్పారు. చెల్లూరు, పసలపూడి గ్రామాలకు చెందిన ఇరువురు విద్యార్థులకు మెల్లకన్ను దృష్టిలోపం గుర్తించి వారికి శస్త్రచికిత్స చేసేందుకు సిఫార్సు చేశామన్నారు. విద్యార్థుల్లో అంధత్వ నివారణ , దృష్టి లోపం గుర్తించేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం కొవ్వూరి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రకళ, విద్యశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.రంజిత, ఏఎన్‌ఎం జి.విద్య, శ్రీదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

24,25 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

కాట్రేనికోన, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చిలకాయిచెరువులో స్టేట్ వాలీబాల్ ప్లేయర్ మోర్త ప్రతిష్ఠ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్‌పోటీల బ్రోచర్‌ను మంగళవారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆవిష్కరించారు.

వెంకన్న ఆదాయం రూ.1.54 లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం లో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,54,719 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

8న సర్వసభ్య సమావేశం

రాయవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన మంగళవారం తెలిపారు. ఉదయం 10.30కు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

జనసేనలో చేరికలు



చెముడులంకలో వైసీపీ నుంచి జనసేనలోకి చేరిన నాయకులు, కార్యకర్తలు

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చెముడులంకలో వైసీపీ నుంచి జనసేన పార్టీలో నాయకులు, కార్యకర్తలతో భారీ చేరికలు జరిగాయి. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు సారథ్యంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 200 మంది నాయకులు, కార్యకర్తలు చేరారు. గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యులు, వైసీపీ కీలక నాయకులు ఉన్నారు. పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సూరపురెడ్డి సత్య, బొక్కా ఆదినారాయణ, సలాది జయప్రకాష్‌నారాయణ, కొత్తపల్లి నగేష్, గారపాటి శ్రీనివాస్‌చౌదరి, పడాల అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో రెవెన్యూ గ్రామసభ

ద్రాక్షారామ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం చోడవరంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ నేదూరి సంతోషమ్మ అధ్యక్షతన జరిగిన సభలో రీసర్వే సమస్యలపై రైతుల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయరు శ్రీనివాస్, మండల సర్వేయరు నాగేశ్వర్, గ్రామ సర్వేయరు సుందరపల్లి దుర్గాభవానీ, వీఆర్‌వో పంపన విష్ణుమూర్తి, కార్యదర్శి పిల్లి త్రినాద్ పాల్గొన్నారు.



ఆత్రేయపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వెండి పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు



కొత్తపేటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



మండపేటలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో నాగులచవితి

- కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- పుట్ట వద్ద పాలు పోసిన మహిళలు
- బాణసంచా కాల్పులు

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులచవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిపారు. వేకువజామున మహిళలు పుణ్యస్నానాలు చేసి పుట్టల వద్ద పూజలు, బాణసంచా కాల్పులు జరిపారు. ఆత్రేయపురంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండిపుట్టలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో చెంతనే ఉన్న వెండి పుట్టలో భక్తులు పూజలు చేశారు.

కొత్తపేట: మండలంలో నాగుల చవితిని ఘనంగా జరిపారు. వేకువజాము నుంచే భక్తులు సమీపంలోని పుట్టల వద్ద పాలు, చలివిడి, చిమ్మి, తేగలను నైవేద్యంగా సమర్పించారు. పుట్టల వద్ద చిన్నారులు బాణసంచా కాల్చారు. మండలంలోని పలు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలు కిటకిటలాడాయి. శనేశ్వర ఆలయ ప్రాంగణంలోనున్న నాగేంద్రస్వామి ఆలయం కిటకిటలాడింది.

రావులపాలెం: మండలంలో నాగులచవితిని పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో నాగేంద్రుని పుట్టలో పాలుపోసి నైవేద్యాలను సమర్పించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకం చేశారు.

ఆలమూరు: నాగులచవితి సందర్భంగా ఉదయం నుంచే మహిళలు పాముల పుట్టల వద్ద పూజలు చేయడానికి బారులుతీరారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాల్చారు. గుమ్మిలేరు ఉరదాలమ్మ అమ్మవారి ఆలయం వద్దనున్న నాగమ్మపుట్ట వద్ద భక్తులు పూజలు జరిపారు.

మండపేట: నాగులచవితిని భక్తులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. మండపేటతో పాటు పలు గ్రామాల్లో నాగులుచవితిని జరిపారు.

కె.గంగవరం: మండలంలో నాగుల చవితిని ఘనంగా జరిపారు. వేకువజామునే పుణ్యస్నానాలు చేసి సమీపంలోని పుట్టల వద్ద పూజ లు చేశారు. చిన్నారులు బాణసంచా కాల్చారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. యండగండి, పామర్రు, దంగేరు తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆల యాలు కిటకిటలాడాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరిపారు. అంగర, పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, వల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లోని భక్తులు వేకువజామునే పుట్టల వద్ద పూజలు చేశారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు.

రాయవరం: మండలంలో మంగళవారం నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరిపారు. సోమేశ్వరం బాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోనున్న పుట్టల వద్ద అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో భక్తులు పుట్ట వద్ద పూజలు చేసి సోమేశ్వరస్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. వెదురుపాక తుల్యాబాగ డ్రైన్ సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద, రాయవరం నాగమ్మపుట్ట వద్ద, మండలంలోని పసలపూడి వల్లిదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచే బారులుతీరారు. శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పలువురు పూజలు చేశారు.



కె.గంగవరం మండలం యండగండిలో మహిళల పూజలు



రాయవరం మండలం పసలపూడిలో పుట్ట వద్ద పూజలు

విజయదుర్గా పీఠంలో: మండలంలోని వెదురుపాక విజయదుర్గాపీఠంలో నాగుల చవితి పురస్కరించుకుని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, అభిషేకాలు ప్రత్యేక పూజలు జరిపారు. ఈపూజల్లో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీబాపిరాజు, గాడ్ కుమార్తెలు బి.రమ, గాదే సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ, పెద్దపాటి శ్రీనివాసమూర్తి, సత్యకనకదుర్గ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ భక్తులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ విధానంపై కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ మంగళవారం తనిఖీలు చేశారు. ఆలమూరు తహశీల్దార్ ప్రకాష్‌బాబుతో కలసి ఆయన ఆలమూరులో పంపిణీ వాహనాలను పరిశీలించారు. వినియోగదారుల నుంచి వివరాలు సేకరించారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

రావులపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిపో బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని రావులపాలెం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డ్రైవర్ రాజుపై కాళ్ళ గ్రామస్తుల దాడికి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ జీపీ రావు, ప్రెసిడెంట్ ఎల్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌లాండ్ క్లోరిన్‌తో నీటిశుద్ధి

ద్రాక్షారామ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పంచాయతీలో ఇన్‌లాండ్ క్లోరిన్‌తో నీటిశుద్ధి చేసే ప్రక్రియను సర్పంచ్ కొత్తపల్లి అరుణ మంగళవారం ప్రారంభించారు. బల్లమార్కెట్ వద్ద ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకు వద్ద, నున్నవారి వీధిలో ఓహెచ్‌ఎస్ఆర్ వద్ద ఏర్పాటు చేసిన ఇన్‌లాండ్ క్లోరిన్ ఎక్విప్‌మెంటును సర్పంచ్ అరుణ ప్రారంభించారు. రామచంద్రపురం మండలంలో తొలిసారిగా ఈ విధానంతో నీటిని శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, కార్యదర్శి పెట్లా సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించిన దాతలు

మండపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరంలో ఉన్న పోలిశెట్టిసత్తిరాజు, భూషణం జిల్లాపరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు 102మందికి గ్రామానికి చెందిన వల్లూరి వీరభద్రరావు దంపతులు పబ్లిక్ పరీక్ష ఫీజు రూ.125వంతున రూ12,750 చెల్లించారని హెచ్‌ఎం టీ.నరేంద్ర తెలిపారు. దాతను పాఠశాల విద్యా కమిటీ సభ్యులు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ కోరా శివ, గ్రామపెద్దలు నూని వీర్రాజు, వేగుళ్ల రామకృష్ణ తదితులు సత్కరించారు.

అయ్యప్ప పడిపూజకు పోటెత్తిన భక్తులు



అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

ఆలమూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చొప్పెల్లలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ జరిపారు. చొప్పెల్ల గ్రామానికి చెందిన ముక్కొండ వెంకటేశ్వరరావుస్వామి అయ్యప్ప మాలదారణ 18వ సారి వేసుకున్న సందర్భంగా అయ్యప్పస్వామి పడిపూజ ఏర్పాటు చేశారు. కడియం గ్రామానికి చెందిన తాడాల వీరవెంకట్రావు గురుస్వామి పూజలను నిర్వహించగా గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన శివశంకర్ గురుస్వామి ఆలపించిన అయ్యప్ప భక్తిగీతాలు అలరించాయి. పడిపూజలో అయ్యప్ప మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి వెండి పాదుకలు బహుకరణ

చెముడులంక శివారు గాంధీనగరం జాతీయరహదారి పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయానికి వెండి పాదుకలు అందించారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ చోడిశెట్టి చంద్రశేఖర్ పద్మలీల దంపతులు అర కిలో వెండితో చేయించిన పాదుకలను ఆలయంలో పూజలు జరిపి నిర్వాహకులు అందించారు. దాత చంద్రశేఖర్, పద్మలీల దంపతులను పలువురు అభినందించారు

శ్రమదానంతో తుప్పలు తొలగింపు



కూళ్ల - వాకతిప్ప రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న దృశ్యం

కె.గంగవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల గ్రామం నుంచి వాకతిప్ప రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఈ రహదారిలో ఎదురెదురు వాహనాలు తప్పుకోవడానికి అవకా శం ఉండటం లేదు. బస్సు, లారీ వంటి భారీ వాహనాలు వస్తుంటే ద్విచక్రవాహన దారులు, పాదచారు లు తుప్పల్లోకి వెళ్ళవలసి వస్తున్నది. ఇక్కడి సమస్యపై కూళ్ల గ్రామానికి చెందిన చిట్టూరి రామ్మోహన్ రావు గుర్తించి రూ.10,500 వెచ్చించి ప్రొక్లెయినర్‌తో సుమారు కిలోమీటరు మేర రోడ్డు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించారు. ఆయన సేవా దృక్పదాన్ని సర్పంచ్ చిల్లి నాగేశ్వరావు తదితరులు అభినందించారు.